

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

01.09.2026

మంగళవారం | రంగారెడ్డి

సంపుటి : 01 | సంచిక: 63

పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## మూడు విభాగాలుగా రాష్ట్ర అభివృద్ధి

- సీఎం రేవంత్ రెడ్డి కామెంట్
- ప్రణాళికతో మౌలిక వసతుల అభివృద్ధి
- మూసారాంబాగ్ కొత్త వంతెన ప్రారంభం
- అంబర్‌పేటలో ఇందిరమ్మ ఇళ్లు
- ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు చర్యలు
- చెరువుల ఆక్రమణలపై కౌంటర్
- గత ప్రభుత్వ అప్పులపై విమర్శలు
- ఉద్యోగులకు సకాలంలో జీతాలు
- ప్రపంచ నగరంగా హైదరాబాద్ లక్ష్యం





హైదరాబాద్, ఆగస్ట్ 31, అనంత జనశక్తి న్యూస్
రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రణాళికబద్ధంగా రాష్ట్రంలో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మూసీ నదిపై మూసారాంబాగ్‌లో నిర్మించిన కొత్త వంతెనను ముఖ్యమంత్రి ప్రారంభించి అనంతరం మాట్లాడారు.

''అంబర్‌పేటలో ఏ కార్యాలయాలూ లేవు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొంచెం వర్షం వస్తే మూసారాంబాగ్ బ్రిడ్జి మునిగేది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు బ్రిడ్జి కట్టలేకపోయింది? మేం రెండేళ్లలోనే వంతెనను పూర్తి చేశాం. ఊరి బయట పది కిలోమీటర్ల అవతల డబుల్ బెడ్ రూంలు కడితే ఇక్కడ ఉన్న వాళ్లకు అవి ఎలా ఉపయోగపడతాయి? అంబర్‌పేటలో 10 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు కట్టాలని కంకణం కట్టుకున్నాం. బతుకమ్మ కుంటను కబ్జా చేయడానికి ప్రయత్నం చేసింది ఎవరో తెలియదా? ఈరోజు బతుకమ్మ కుంట పేదలకు అంకితం అయింది. విమానం నుంచి పూలు చల్లిన ఎడ్ల సుధాకర్.. మళ్లీ బతుకమ్మ కుంటను ఆక్రమించాలని చూస్తున్నారు. ఆయన వెనుక ఉన్నదెవరో ఆలోచించాలి. హైడ్రాపై, నాపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. కబ్జాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలి. 2023 డిసెంబర్ 7న మీ ఆశీర్వాదం వల్ల ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాయి. ప్రజా ప్రభుత్వం వచ్చి 1000 రోజులు పూర్తయింది. రేవంత్ రెడ్డిపై బురద చల్లడానికి కొన్ని అల్లరి మూకలు బయల్దేరాయి. చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నామే తప్ప వాటిలో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు మేం కట్టలేదు.

2లో..

## తెలంగాణలో తొలిసారి కవచ్ ప్రాజెక్ట్

- రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్య
- కొత్త రైల్వే ట్రాక్‌లు, వాటిని ఉన్నతీకరణ

2లో..



హైదరాబాద్, ఆగస్ట్ 31, అనంతజనశక్తి న్యూస్
తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో తాము పనిచేస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొత్త రైల్వే ట్రాక్‌లు, వాటిని ఉన్నతీకరణ చేసే విధంగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్న రైల్వే స్టేషన్ పనులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పరిశీలించారు.

## శాంతిభద్రతల నిర్వహణ ప్రభుత్వ బాధ్యత

- సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడి



2లో..

## మోదీతో ఇరాన్ అధ్యక్షుడు పెజిష్కియాన్ భేటీ

- అమెరికాతో యుద్ధం తర్వాత తొలిసారి
- 4 రోజుల పశ్చిమాసియా పర్యటనలో మోదీ
- బిష్‌కేక్‌లో ఎస్‌సీఓ శిఖరాగ్ర సదస్సు
- అమెరికాకు వ్యతిరేకంగా ఇరాన్ మద్దతు కూడగట్టే ప్రయత్నం

2లో..



## 33శాతం పచ్చదనం తప్పనిసరి

- పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో..
- పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యం
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

2లో..

అమరావతి, ఆగస్ట్ 31, అనంతజనశక్తి న్యూస్
ఏపీ ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలన్నారు.



## ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ల్యాప్ టాప్ కొనొచ్చు.. కానీ..

- ఏటా అక్రమ సంపద
- మనీ లాండరింగ్‌పై సీజేఐ కామెంట్

2లో..

న్యూఢిల్లీ, ఆగస్ట్ 31, అనంత జనశక్తి న్యూస్
ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న మనీ లాండరింగ్ కేసులపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యా కాంత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

## రోశయ్య లాంటి రాజకీయాలకు మా తరం దూరమైంది

- మంత్రి లోకేశ్ వెల్లడి
- యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపు
- రోశయ్యే మా తరానికి ఆదర్శమన్న లోకేశ్
- 'స్టేట్స్‌మ్యాన్'గా రోశయ్యకు గుర్తింపు ఇవ్వాలి
- విశాఖలో ఏఐజీకి భూమిపూజ.. రూ.2 వేల కోట్ల పెట్టుబడి



విజయవాడ, ఆగస్ట్ 31, అనంతజనశక్తి న్యూస్
ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఏఐజీ ఆసుపత్రి రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు విశాఖ 8వ వార్డులోని ఎండాడ వద్ద ఏఐజీ హాస్పిటల్స్ నిర్మాణానికి సంస్థ ఛైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డితో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భూమిపూజ చేశారు. ఎండాడ వద్ద వేదిక ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేశ్‌కు ఏఐజీ హాస్పిటల్స్ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆసుపత్రి నిర్మాణ పనులకు మంత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. ఆసుపత్రికి సంబంధించి రూపొందించిన ఏవీని వీక్షించారు.

2లో..

## ఒక్క కొత్త క్లాస్ రూమ్ కట్టిందా?

- అధికారంలోకి వచ్చి మూడేండ్లు
- కాంగ్రెస్‌పై హరీశ్ ఫైర్
- తక్షణమే డీఎస్సీ నిర్వహించి తీరాలి
- ఆలోపు విద్యా వాలంటీర్లను నియమించాలి
- పేద విద్యార్థులకు న్యాయం చేయాలి

2లో..



సిద్దిపేట, ఆగస్ట్ 31, అనంత జనశక్తి న్యూస్
సిద్ది పేట జిల్లా తడ్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు జోగు వెంకటేశం పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ విద్యా విధానాలపై, ఉద్యోగుల పట్ల అవలంబిస్తున్న తీరుపై ఆయన మండిపడ్డారు.

## నోయిడాలో నిర్భయ తరహాలో ఘోరం

- కదులుతున్న బస్సులో బాలికపై గ్యాంగ్‌రేప్
- ఇద్దరు నిందితులు అరెస్ట్

నోయిడా, ఆగస్ట్ 21, అనంత జనశక్తి న్యూస్
నోయిడాలో నిర్భయ తరహాలో ఘోరం జరిగింది. కదులుతున్న బస్సులో 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. అనంతరం ఢిల్లీలో 40 కి.మీ దూరంలో వదిలేసి పరారయ్యారు. ఈ ఘటన ఇప్పుడు దేశ వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఆగస్టు 4న గ్రేటర్ నోయిడాలో ఈ దారుణం చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసులో నిందితులుగా ఉన్న బస్సు డ్రైవర్ కుల్దీప్ (39), కండక్టర్ సందీప్ (26)ను పోలీసులు అరెస్టు చేశారు.

2లో..

## బీజేపీ ఆఫీస్‌పై దాడి

- కాంగ్రెస్‌పై బండి సంజయ్ ధ్వజం
- నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు
- గేటుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారు?
- ఇంటెలిజెన్స్ వ్యవస్థ పనిచేస్తోందా?

2లో..



## వెలుగొండ వెలుగు వైఎస్సార్

- చంద్రబాబు గారూ..
- ఈ పని చేయండి
- చంద్రబాబుది రాజకీయ ప్రచారం
- ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల

2లో..



వెలిగొండ, ఆగస్ట్ 31, అనంత జనశక్తి న్యూస్
వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం వేళ.. ఈ ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత తమదంటే తమదంటూ ఏపీలోని రాజకీయ పార్టీలు పోటీపడుతున్నాయి. సీఎంచంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన రాయి వేయడం తప్ప చేసిందేమీ లేదని.. క్రెడిట్ చోరీకి యత్నిస్తున్నారని జగన్ ఆరోపిస్తున్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఘనత వైఎస్సార్, వైసీపీ ప్రభుత్వానిదేనని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు వైఎస్ఆర్, వైఎస్ జగన్ కంటే ప్రాజెక్టు కోసం ఎక్కువ నిధులు తమ ప్రభుత్వమే కేటాయించిందని చంద్రబాబు చెప్తున్నారు. ప్రాజెక్టుకు కేటాయించిన నిధులలో సగం తమ ప్రభుత్వంలో మంజూరు చేసినవేనని స్పష్టం చేస్తున్నారు.

## రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు

- ఏపీ లిక్కర్ కేసు వ్యవహారం
- హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ..
- ఏపీ ప్రభుత్వం.. సుప్రీం కోర్టును ఆశ్రయించింది



2లో..

# తెలంగాణలో తొలిసారి కవచ్ ప్రాజెక్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. మహబూబ్‌నగర్‌ను రైల్వేహాబ్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. 5 వందేభారత్ రైళ్లను కేంద్రప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిందని ప్రస్తావించారు. మోదీ హయాంలోని పదేళ్లలో 100 కొత్త రైళ్లను తెలంగాణలో అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు.

**తెలంగాణలో 42 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నాం..**

తెలంగాణలో 42 రైల్వేస్టేషన్లను ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని చెప్పుకొచ్చారు. 2014కు ముందు రైల్వేస్టేషన్లు అధ్వానంగా ఉండేవని.. కానీ నేడు మోదీ హయాంలో పరిస్థితి మారిందని తెలిపారు. ప్రయాణికులు భాగస్వాములైతే స్వచ్ఛస్టేషన్లు సాధ్యమవుతాయని వివరించారు. రైల్వేస్టేషన్లు ఏయిర్‌పోర్టు స్థాయిలో ఉండాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని ఉద్ఘాటించారు.

**తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్లు..**

2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో రూ.886 కోట్ల రైల్వేబడ్జెట్ ఉంటే 202627 బడ్జెట్‌లో తెలంగాణకే రూ.5454 కోట్లను కేంద్రం కేటాయించిందని కిషన్‌రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి తెలంగాణలో రైల్వే రంగం నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. దేశంలో 7 బుల్లెట్ ట్రైన్స్ ప్రవేశపెడితే.. తెలంగాణకు మూడు ఇచ్చామని.. ఇది రైల్వేరంగంలో సువర్ణాధ్యాయమని నొక్కిచెప్పారు. రూ.5 లక్షల కోట్లతో బుల్లెట్ ట్రైన్స్ అందుబాటులోకి తీసుకువస్తున్నామని స్పష్టం చేశారు. ప్రమాదాలు జరగకుండా దేశంలోనే తొలిసారిగా కవచ్ ప్రాజెక్ట్‌ను తెలంగాణలో ప్రయోగాత్మకంగా అమలు చేయబోతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు

**అమరావతి, ఆగస్ట్ 31, అనంత జనశక్తి న్యూస్**

ఏపీ మద్యం రవాణా కేసులో రాజ్ కసిరెడ్డి, డి. వాసుదేవరెడ్డిల అరెస్టుల వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. ఇద్దరి అరెస్టులకు సంబంధించిన అంశంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా ఇద్దరికీ కోర్టు.. నోటీసులు జారీ చేసింది. ఈ కేసు విచారణ ప్రక్రియలో నిబంధనలను సరిగ్గా పాటించలేదన్న కారణంతో గతంలో ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం.. సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సీజేఐ ధర్మాసనం.. రాజ్ కసిరెడ్డి, డి.వాసుదేవరెడ్డిలకు నోటీసులు జారీ చేసింది. హైకోర్టు తీర్పుపై ప్రభుత్వ అభ్యంతరాలను పరిశీలించిన ధర్మాసనం.. తదుపరి విచారణను వాయిదా వేసింది. తదుపరి విచారణలో ఈ కేసుకు సంబంధించిన అంశాలపై సుప్రీంకోర్టు మరింతగా పరిశీలించే అవకాశం ఉంది.

# 33శాతం పచ్చదనం తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం వల్ల వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని డిప్యూటీ సీఎం తెలిపారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం అందరి బాధ్యతన్నారు. అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణలను సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమాజానికి, ప్రకృతికి, రాబోయే తరాలకు విలువైన భవిష్యత్తును అందించగలమని పేర్కొన్నారు. ఏపీ వ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీగ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పవన్ ఆదేశించారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# శాంతిభద్రతల నిర్వహణ ప్రభుత్వ బాధ్యత

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 31, అనంతజనశక్తి న్యూస్**

రాజధాని ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతిపాదిత ఆందోళన కార్యక్రమానికి సుప్రీంకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిర్వహించాలనుకుంటున్న శాంతియుత మార్చ్‌పై ఎలాంటి ఆంక్షలు విధించలేమని దేశ అత్యున్నత న్యాయస్థానం సోమవారం స్పష్టం చేసింది. శాంతిభద్రతల పరిరక్షణ, అవసరమైన నిబంధనల అమలు పూర్తిగా ప్రభుత్వ అధికార పరిధిలోని అంశాలని కోర్టు ఉద్ఘాటించింది.

చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా (సీజేఐ) జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జైమాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ విచారణ చేపట్టింది. ఈ నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారుతుందని ముందే ఊహించడానికి ఎలాంటి తగిన ఆధారాలు లేవని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**శాంతిభద్రతలు ప్రభుత్వాల బాధ్యతే**

ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ చట్టపరమైన పరిమితులకు లోబడి నడుచుకుంటారనే భావిస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. "ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తారని ముందే భావించడానికి మా వద్ద ఎలాంటి బలమైన ఆధారాలు లేవు. ప్రతి ఒక్కరూ ఒకరి ప్రాథమిక, చట్టబద్ధమైన హక్కులను మరొకరు గౌరవిస్తూ, శాంతియుతంగా వ్యవహరిస్తారనే నమ్మకం మాకుంది" అని బెంచ్ పేర్కొంది. మార్చ్‌కు అనుమతి ఇవ్వాలా వద్దా, ఏ షరతులతో అనుమతించాలనేది పోలీసు, పరిపాలనా యంత్రాంగాల నిర్ణయానికే వదిలేస్తున్నట్లు స్పష్టం చేసింది.

ఢిల్లీలోని లుటెన్స్ ప్రాంతంతో పాటు ఇండియా గేట్, సెంట్రల్ విస్టా వంటి భద్రతాపరంగా అత్యంత కీలకమైన ప్రాంతాల్లో భారీ నిరసనలు, ర్యాలీలను నియంత్రించాలని కోరుతూ శివమ్ ఉపాధ్యాయ, ఢిల్లీ విశ్రాంత పోలీస్ అధికారి రాజేంద్ర సింగ్ దాఖలు చేసిన పిటిషన్లపై కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

# ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ల్యాప్ టాప్ కొనొచ్చు.. కానీ..

(మొదటి పేజీ తరువాయి)

ఏటా ప్రపంచంలో లాండరింగ్ అవుతున్న అక్రమ ధనాన్ని లెక్కగడితే.. ప్రపంచంలోని 800 కోట్ల మంది జనాభాలో ప్రతి ఒక్కరికీ ఓ ల్యాప్‌టాప్ కొనివ్వవచ్చని చెప్పారు. అంత పెద్ద మొత్తంలో నల్లధనం చేతులు మారుతుంటే.. రికవరీ చేసేది ఒక శాతం కంటే తక్కువేనని వివరించారు. శనివారం రోజు కేంబ్రిడ్జ్‌లో జరిగిన 43వ అంతర్జాతీయ ఆర్థిక నేరాల సదస్సు ముగింపు సమావేశంలో మాట్లాడుతూ.. ఆయన ఈ కామెంట్లు చేశారు. ప్రపంచవ్యాప్తంగా కొల్లగొడుతున్న అక్రమ ఆస్తుల్లో కేవలం ఒక శాతం కంటే తక్కువ మాత్రమే రికవరీ అవుతోందని సీజేఐ స్పష్టం చేశారు. "నల్లధనానికి సంబంధించిన 100 భాగాలలో 99 భాగాల గురించి కేవలం ఉపన్యాసాలు, నివేదికల్లో మాత్రమే మాట్లాడుకుంటున్నారు. ఒక్క శాతం నిధులను మాత్రమే తిరిగి దారిలోకి తేగలుగుతున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక నేరాలను ఎదుర్కోవడంలో నేర నిరూపణ కంటే, ఆ అక్రమ నిధులను గుర్తించడం, స్తంభింపజేయడం, తిరిగి తెప్పించడానికే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

40 రకాల ప్రభుత్వ నిధుల దుర్వినియోగ మార్గాలను..! ఆర్థిక నేరాలు నేటి కాలపు కొత్త సమస్యలు కాదని, అవి సాంకేతికతతో పాటు రూపాంతరం చెందుతున్నాయని తెలిపారు. క్రీస్తు పూర్వం 4వ శతాబ్దానికి చెందిన గ్రీకు వ్యాపారి హేగెస్ట్రాటోస్ చేసిన బీమా మోసాన్ని, అలాగే కౌటిల్యుని అర్థశాస్త్రంలో పేర్కొన్న 40 రకాల ప్రభుత్వ నిధుల దుర్వినియోగ మార్గాలను సీజేఐ ఉదాహరణగా పేర్కొన్నారు.

# వెలుగొండ వెలుగు వైఎస్సార్

**వెలిగొండ, ఆగస్ట్ 31, అనంత జనశక్తి న్యూస్**

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం వేళ.. ఈ ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత తమదంటే తమదంటూ ఏపీలోని రాజకీయ పార్టీలు పోటీపడుతున్నాయి. సీఎంచంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన రాయి వేయడం తప్ప చేసిందేమీ లేదని.. క్రెడిట్ చోరీకి యత్నిస్తున్నారని జగన్ ఆరోపిస్తున్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఘనత వైఎస్సార్, వైసీపీ ప్రభుత్వానిదేనని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు వైఎస్‌ఆర్, వైఎస్ జగన్ కంటే ప్రాజెక్టు కోసం ఎక్కువ నిధులు తమ ప్రభుత్వమే కేటాయించిందని చంద్రబాబు చెప్తున్నారు. ప్రాజెక్టుకు కేటాయించిన నిధులలో సగం తమ ప్రభుత్వంలో మంజూరు చేసినవేనని స్పష్టం చేస్తున్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించిటీడీపీ, వైసీపీ మధ్య సోషల్ మీడియాలో ఈ వార్ జరుగుతుంటే.. తాజాగా ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఎంట్రీ ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టుకు చంద్రబాబు చేసిందేమీ లేదని.. మొత్తం ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డికి చెందుతుందంటూ సుదీర్ఘ ట్వీట్ చేశారు షర్మిల . మూడు దశాబ్దాలకు వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం కావటం శుభసూచకమన్న షర్మిల.. కరువురక్కసి కోరల్లో చిక్కుకున్న ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు ఇకనైనా సాగు, త్రాగు నీరు మరింత మెరుగ్గా అందుతాయని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. వెలిగొండకు వెలుగు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని చెప్పిన షర్మిల.. మూడు దశాబ్దాల వెలిగొండ ప్రజాస్వప్నంపై ఆయనది చెరగని సంతకమని అభివర్ణించారు. కాగితాల నుంచి క్షేత్రస్థాయికి, కాలువల నుంచి సొరంగాల వరకు సింహభాగం పనులు వైఎస్ఆర్ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. వెలిగొండపై చంద్రబాబువి కొండంత అబద్ధాలని.. కట్టిన కష్టం వైఎస్ఆర్‌ది అయితే, రాజకీయ ప్రచారం చంద్రబాబుదని మండిపడ్డారు. సంకల్పం పేరుతో 1996 మార్చి 5న చంద్రబాబు కేవలం ఓ రాయిని వేశారని..శిలాఫలకం తప్పా తట్టెడు మట్టి ఎత్తింది లేదంటూ షర్మిల విమర్శించారు. 2004లో అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్ఆర్.. చిన్న ప్రాజెక్టుగా ఉన్న వెలిగొండను భారీ ప్రాజెక్టుగా రీ డిజైన్ చేశారని గుర్తు చేశారు. వెలిగొండ ప్రాజెక్టును 82 శాతం పూర్తి చేసింది రాజశేఖర్ రెడ్డి అని.. □ట్విన్ టన్నెల్స్, నల్లమల సాగర్, మూడు ప్రధాన డ్యాములతో భారీ ప్రాజెక్టుగా తీర్చిదిద్దింది ఆయనేనని పేర్కొన్నారు.

# మోదీతో ఇరాన్ అధ్యక్షుడు పెజిష్కియాన్ భేటీ

**టెహ్రాన్ ఆగస్ట్ 31, అనంతజనశక్తి న్యూస్**

నాలుగు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కేక్‌లో జరుగుతోన్న షాంఘై కోఆపరేటివ్ ఆర్గనైజేషన్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరిలో అమెరికా ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ఈ ఇద్దరు నాయకుల మధ్య జరిగిన మొదటి ముఖాముఖి భేటీ ఇదే. ఈ సమావేశంలో చర్చించిన అంశాలపై ఇంకా స్పష్టత రాలేదు కానీ హర్మ్యూజ్ జల సంధిలో ఇరాన్ దిగ్బంధనంపై ప్రధానంగా చర్చ జరిగి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

''కిర్గిజ్‌స్థాన్‌లో జరుగుతోన్న షాంఘై సహకార సంస్థ సదస్సు, షాంఘై ప్లస్ సదస్సులో పాల్గొనడానికి వెళ్లిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్ సమావేశమై చర్చలు జరిపారు'' అని న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేసింది.



అమెరికా వ్యతిరేకంగా మద్దతును కూడగట్టేందుకు ఎస్‌సీఓ సదస్సుకు ఇరాన్ అధ్యక్షుడు హాజరవుతున్నారు. ట్రంప్ బెదిరింపులకు భయపడేది లేదని తెగేసి చెప్పిన ఆయన.. ఇరాన్ యుద్ధాన్ని కోరుకోవడం లేదని, కానీ ఎలాంటి దురాక్రమణకైనా దృఢ నిశ్చయంతో ప్రతిస్పందిస్తుందని స్పష్టం చేశారు. ''దురాక్రమణదారులకు టెహ్రాన్ ధీటుగా ప్రతిస్పందిస్తుంది'' అని నొక్కి చెప్పారు. అయితే, చర్చల వివాదాన్ని పరిష్కరించుకోడానికి పెజెష్కియన్ మొగ్గుచూపారు. నెల రోజుల్లోనే మొదటిసారిగా ఇరాన్‌కు చెందిన చిన్న దీవిపై అమెరికా జరిపిన సైనిక దాడి అనంతరం ఆయన నుంచి ఈ ప్రకటన వచ్చింది.

పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరత అన్ని దేశాలకూ నష్టమేనని పేర్కొన్న ఆయన... ఆర్థిక, భద్రతా లక్ష్యాలను సాధించడానికి అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ''ఈ సమావేశం చాలా ముఖ్యమైనది. ఈ ప్రాంతంలోని మెజారిటీ నాయకులు హాజరవుతారు. ప్రపంచంలో కొన్ని అంతర్జాతీయ సంస్థలు ఒకే విధమైన వ్యవస్థను తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో... విభిన్న, స్వతంత్ర గొంతుకలు ప్రపంచ వేదికపై ఉన్నాయని నిరూపించేందుకు ఈ సమావేశం ఒక సంకేతంగా నిలుస్తుంది'' అని ఆయన తెలిపారు.

ఇదిలా ఉండగా, ఈ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా అర్మేనియా ప్రధాన మంత్రి నికోల్ పాషిన్యాన్‌ను కూడా ప్రధాని మోదీ కలిశారు. రక్షణ, ఆర్థిక, ఫార్మా, సైన్స్ అండ్ టెక్నాలజీ, సంస్కృతి, విద్యతో సహా వివిధ రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. పశ్చిమాసియాలో పరిస్థితులు సహా ప్రాంతీయ, ప్రపంచ పరిణామాలపై కూడా తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించి అర్మేనియాతో కలిసి పనిచేయడానికి భారత్ ఎదురుచూస్తోందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

ఈ సమావేశంలోనే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను కూడా మోదీ కలవనున్నారు. కిర్గిజ్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు 6వ ప్రపంచ నోమాడ్ గేమ్స్ అధికారిక ప్రారంభోత్సవానికి ఆయన హాజరుకానున్నారు.

# రోశయ్య లాంటి రాజకీయాలకు మా తరం దూరమైంది

(మొదటి పేజీ తరువాయి)

విశాఖలో నెలకొల్పనున్న ఏఐజీ ఆసుపత్రి ద్వారా సంస్థ దశలవారీగా ఐదేళ్లలో రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 9వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. పూర్తిస్థాయి నిర్మాణం పూర్తయ్యే నాటికి ఆసుపత్రి సామర్థ్యం వెయ్యి పడకలకు చేరనుంది. విశాఖలో 9 ఎకరాల్లో ఆసుపత్రి క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనుంది.

దివంగత మాజీ గవర్నర్, మాజీ సీఎం కొణిజేటి రోశయ్య స్ఫూర్తితో యువత రాజకీయాల్లోకి రావాలని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని ఆలిండియా రేడియో జంక్షన్‌లో రోశయ్య విగ్రహాన్ని ఈరోజు (సోమవారం) ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్, టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి టీజీ భరత్, ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు వంశీ, విష్ణు కుమార్ రాజు, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**రోశయ్య లాంటి రాజకీయాలకు మా తరం దూరమైంది..**

రోశయ్యను స్టాట్యూ ఆఫ్ స్టేట్స్ మాన్‌గా నామకరణం చేయాలని మంత్రి లోకేశ్ సూచించారు. తమలాంటి యువతకు రోశయ్య ఆదర్శమని పేర్కొన్నారు. రోశయ్య లాంటి రాజకీయాలకు తమ తరం దూరమైందని బాధపడుతున్నానని తెలిపారు. తమ తరం రాజకీయాల్లో మార్పు రావాలని చెప్పారు. ఆయన అన్ని పదవుల్లో పనిచేశారని.. తెలుగు జాతి కోసం ఆలోచించారని కొనియాడారు. రోశయ్య గురించి పుస్తకాలు రాయాలని, కుటుంబ సభ్యులతో కలిసి ఓ మ్యూజియం కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన చివరి వరకు కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నారని తెలిపారు. అలాంటి కమిట్‌మెంట్ యువతలో ఉండాలని, ప్రతి ఒక్కరిలో ఉండాలని మంత్రి లోకేశ్ సూచించారు.

**9వేలమందికి ఉద్యోగాలు: లోకేష్**

ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఏఐజీ ఆసుపత్రి హైదరాబాద్‌లో మాత్రమే ఉంది.. ఇప్పుడు విశాఖపట్నంలోనూ అందుబాటులోకి రానుంది. ఏఐజీ దశలవారీగా ఐదేళ్లలో రూ.2వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది.. 9 ఎకరాల్లో ఆస్పత్రి.. 2.5 ఎకరాల్లో నర్సింగ్ కాలేజీని ఏర్పాటు చేయనుంది. ఏఐజీ రాకతో 9వేలమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయంటున్నారు. ఏఐజీ మొదటి దశలో టవర్A , టవర్B లలో 650 పడకలతో 2028నాటికి అందుబాటులోకి తీసుకురానున్నారు. రెండో దశలో టవర్C ద్వారా 350 పడకల సామర్థ్యంతో మరో రెండేళ్లలో పనులు పూర్తి చేయనున్నారు. నర్సింగ్ కాలేజీలో విద్యార్థులకు, సిబ్బందికి వసతిగృహాలు, రోగులకు తక్కువ నగదు చెల్లింపుతో గదుల నిర్మాణానికి ప్లాన్ చేశారు.

విశాఖపట్నం ఏఐజీలో వైద్య సేవలు, శిక్షణ, పరిశోధన, రోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సకల సౌకర్యాలతో హెల్త్ కేర్, ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నారు. విశాఖపట్నంలో నిర్మించనున్న ఏఐజీ మెడికల్ క్యాంపస్‌లో 50కి పైగా సూపర్ స్పెషాలిటీ వైద్య విభాగాలు ఏర్పాటు చేస్తారు. 8 మెయిన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు, మదర్ అండ్ చైల్డ్ కేర్ విభాగం ఉంటుంది. నర్సింగ్ కాలేజీ, పారామెడికల్ ట్రైనింగ్ సెంటర్, అధునాతన రీసెర్చ్ ల్యాబ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హెల్త్‌కేర్ సెంటర్‌ను నిర్మిస్తున్నారు. ఏఐజీ రాకతో.. ఉత్తరాంధ్ర ప్రజలు హైదరాబాద్ వెళ్లే పని లేకుండా మెరుగైన వైద్య సేవలు విశాఖపట్నంలో అందుబాటులోకి రానున్నాయి.

# ఒక్క కొత్త క్లాస్ రూమ్ కట్టిందా?

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయుడి సేవలను కొనియాడారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడానికి మన ఊరుమన బడి కార్యక్రమాన్ని తెచ్చాం. మొదటి విడతలోనే తడ్కపల్లి స్కూల్‌ను ఎంపిక చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాం. డిజిటల్ క్లాసులు, డ్యూయల్ డెస్క్‌లు, డైనింగ్ హాల్, తాగునీరు, టాయిలెట్స్ ఇలా అన్ని వసతులు కల్పించాం. కానీ దురదృష్టవశాత్తు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆ కార్యక్రమాన్ని ఆపేసింది. గత మూడేళ్లలో రాష్ట్రంలో ఎక్కడైనా ఒక్క కొత్త క్లాస్ రూమ్ కట్టిందా..? అని నేను ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను. రాష్ట్రంలో 27,000 పాఠశాలలను కేవలం 4,000 పాఠశాలలకు తగ్గిస్తామని సాక్షాత్తూ ముఖ్యమంత్రే చెబుతున్నారు. అంటే బడులను మూసేస్తారా..? ఒకపక్క ఉపాధ్యాయులు ప్రతి నెలా రిటైర్ అవుతున్నారు. వారి స్థానంలో కొత్త టీచర్లను భర్తీ చేయడం లేదు. డీఎస్సీ వేయరు, కనీసం విద్యా వాలంటీర్లనైనా పెట్టుకునే అవకాశం ఇవ్వరు. కేవలం సర్దుబాట్లు, డిప్యూటేషన్ల పేరుతో కాలం వెళ్లదీస్తుండటంతో ప్రభుత్వ బడుల్లో పిల్లల సంఖ్య తగ్గిపోతోంది.

తక్షణమే డీఎస్సీ నిర్వహించి తీరాలి, ఆలోపు విద్యా వాలంటీర్లను నియమించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలి.పాఠశాలల్లో పనిచేసే స్కావెంజర్లకు 2024 నుంచి ఇప్పటివరకు సరిగ్గా జీతాలు ఇవ్వలేదు. నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో పెడితే వాళ్లు ఎలా బతకాలి. హెడ్ మాస్టర్లు జేబులోంచి ఇచ్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు జీవితకాలం పనిచేసి రిటైర్ అవుతున్న ఉద్యోగులకు వారు సొంతంగా దాచుకున్న జీపీఎఫ్, ఇన్సూరెన్స్ డబ్బులు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం ముప్పుతిప్పలు పెడుతోంది.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ రావాలంటే 15% కమీషన్ లంచంగా ఇచ్చుకోవాల్సి వస్తోందని ఓ ఉపాధ్యాయురాలు కన్నీళ్లు పెట్టుకున్న వీడియోను మనమంతా చూశాం. ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. పీఆర్సీ ఊసే లేదు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ తెస్తామని ఎన్నికల్లో చెప్పి.. మూడేళ్లయినా కనీసం ఒక కమిటీ వేయలేదు, చర్చలు జరపలేదు. మధ్యాహ్న భోజనం వండే కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. బయట మార్కెట్‌లో కోడిగుడ్డు ధర 8 రూపాయలు ఉంటే.. ప్రభుత్వం మాత్రం 3.50 పైసలు, 4 రూపాయలు ఇస్తే వాళ్లు పిల్లలకు ఎలా వండి పెడతారని ప్రశ్నించారు.

గత ప్రభుత్వం తెచ్చిన బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ బంద్ పెట్టారు. మళ్లీ ఏదో ప్రారంభిస్తున్నాం అన్నారు కానీ, సిద్దిపేట జిల్లాను పక్కనపెట్టి కక్షసాధింపులకు పాల్పడుతున్నారు. వచ్చే 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఈ సమస్యలన్నింటినీ లేవనెత్తి, ప్రభుత్వం మెడలు వంచుతాం. ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో రిటైర్మెంట్ కార్యక్రమాలు ఉన్నప్పటికీ, జోగు వెంకటేశం మీద ఉన్న ప్రత్యేకమైన ప్రేమ, గౌరవంతోనే నేను స్వయంగా ఇక్కడికి వచ్చాను.ఆయన కేవలం బడికే పరిమితమైన మాస్టారు కాదు, సామాజిక సేవలో ఎప్పుడూ ముందుండే గొప్ప మనసున్న వ్యక్తి అన్నారు. జోగు వెంకటేశం సిద్దిపేటలోని అభయాంజనేయ స్వామి దేవాలయానికి అధ్యక్షుడిగా ఉంటూ, అనేక చిక్కుముడులు విడదీసి ఆ గుడిని అద్భుతంగా అభివృద్ధి చేశారు.

# మూడు విభాగాలుగా రాష్ట్ర అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

మేం అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితి దివాలా తీసింది. ఏడో తేదీ వచ్చినా జీతాలు ఇవ్వలేని పరిస్థితి. రూ.70 వేల కోట్ల అప్పును.. 9 ఏళ్లలో రూ.8.11 లక్షల కోట్లకు చేర్చారు. 16 మంది సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు. కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు మధ్య మధ్యలో నన్ను బెదిరిస్తున్నారు. మేం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కసారైనా ఒకటో తేదీనా జీతాలు ఇవ్వకుండా ఉన్నామా? ఆనాడు పరిపాలన ఎలా ఉందో.. నేడు ఏవిధంగా ఉందో ప్రభుత్వ ఉద్యోగులు ఆలోచించాలి'' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

ప్రపంచ నగరంగా హైదరాబాద్..

హైదరాబాద్ నగరం ఇప్పటికే విద్య, ఉద్యోగ అవకాశాలకు కేంద్రంగా మారిందని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రపంచంతో పోటీ పడే స్థాయిలో నగరం అభివృద్ధి చెందుతోందని, అయితే అందుకు అనుగుణంగా మౌలిక వసతులు, పరిపాలనా వ్యవస్థలు కూడా వేగంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే కోర్ అర్బన్ రీజియన్‌గా ఏర్పాటు చేసి నగరాన్ని మరింత సమగ్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**హైదరాబాద్ నగరం ఇప్పటికే విద్య, ఉద్యోగ అవకాశాలకు కేంద్రంగా మారిందని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రపంచంతో పోటీ పడే స్థాయిలో నగరం అభివృద్ధి చెందుతోందని, అయితే అందుకు అనుగుణంగా మౌలిక వసతులు, పరిపాలనా వ్యవస్థలు కూడా వేగంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే కోర్ అర్బన్ రీజియన్‌గా ఏర్పాటు చేసి నగరాన్ని మరింత సమగ్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.**



# బీజేపీ ఆఫీస్‌పై దాడి

**హైదరాబాద్, ఆగస్ట్ 31, అనంత జనశక్తి న్యూస్**

హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద యూత్ కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కార్యాలయం వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేసి, ఆ పార్టీ కార్యాలయ గేటుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారు? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థ పనిచేస్తోందా? అని నిలదీశారు. పట్టపగలు బీజేపీ ఆఫీస్‌పై దాడి చేస్తుంటే పోలీసులు తమాషా చూస్తున్నారా? అని ధ్వజమెత్తారు.

**కాంగ్రెస్‌కు తొత్తులుగా పోలీసులు పనిచేస్తున్నారా?..**

కాంగ్రెస్‌కు తొత్తులుగా పోలీసులు పనిచేస్తున్నారా? అని బండి సంజయ్ మండిపడ్డారు. భాగ్యనగరం నడిబొడ్డున ఉన్న జాతీయ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి రక్షణ కల్పించే బాధ్యత మీకు లేదా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. యూత్ కాంగ్రెస్ నేతలు అరాచకం సృష్టిస్తోంటే అక్కడ పోలీసులెందుకు లేరు? అని నిలదీశారు. పోలీసుల వైఫల్యానికి మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. తమ సహనాన్ని చేతగానితనంగా భావిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. ఖబడ్దార్ కాంగ్రెస్ నేతల్లారా.... తాము తలుచుకుంటే బయట తిరగలేరని బండి సంజయ్ హెచ్చరించారు.

**యూత్ కాంగ్రెస్ నేతల చర్యకు మించి ప్రతి చర్యలు..**

ఈ ఘటనకు కారణమైన వారిని అరెస్ట్ చేసి చట్టం ముందు సాయంత్రంలోపు నిలబెట్టాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యూత్ కాంగ్రెస్ నేతల చర్యకు మించి ప్రతి చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. బీజేవైఎం కార్యకర్తలు తలుచుకుంటే యూత్ కాంగ్రెస్ నేతలు బయట తిరగలేరని మందలించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నాయకత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్ కార్యాలయాలను బీజేపీ శ్రేణులు దిగ్బంధిస్తారని హెచ్చరించారు. జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# నోయిడాలో నిర్భయ తరహాలో ఘోరం

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర ఢిల్లీలోని తిమార్‌పూర్ ప్రాంతంలోని ఓ పార్కింగ్ స్థలం నుంచి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురికి చెందిన 16 ఏళ్ల బాలిక చదువుల విషయంలో తల్లి మందలించడంతో కుటుంబ సభ్యులకు చెప్పకుండా నోయిడాలోని తన బంధువు ఇంటికి వెళ్లేందుకు బయలుదేరింది. భారీ వర్షం, చీకటి సమయంలో నోయిడాలోని పరి చౌక్ దగ్గర దిగింది. బంధువుల ఇంటికి చేరేందుకు చాలా సమయం పడుతుంది. అప్పటికే రాత్రి 9 గంటలు దాటింది. ఏదైనా వాహనం దొరుకుతుందేమోనని ఎదురుచూస్తోంది. గమ్యస్థానం చేరేందుకు ఇంకా సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉంది.

అదే సమయంలో అటుగా వస్తున్న ఓ బస్సు ఆమె దగ్గర ఆపాడు. స్లీపర్ బస్సు కావడంతో లోపల ప్రయాణికులు ఎవరూ లేరు. బస్సులోకి ఎక్కిన బాలికకు తాము కూడా నోయిడా సెక్టార్63 వైపు వెళ్తున్నామని కండక్టర్ చెప్పినట్లు పోలీసులు తెలిపారు. దీంతో ఆమె బస్సులోకి ఎక్కింది. అయితే వాస్తవానికి ఆ బస్సు గ్రేటర్ నోయిడాలోని సూరజ్‌పూర్‌లో ఉన్న వర్క్‌షాప్ నుంచి తిరిగి వస్తోంది. బస్సు కదలడం ప్రారంభమైన కొద్ది సేపటికే కండక్టర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించడం ప్రారంభించినట్లు ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అనంతరం ఆమెపై నిందితులు లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపింది. ప్రతిఘటిస్తే చంపేస్తామని నిందితులు బెదిరించినట్లు పోలీసులు వెల్లడించారు.

లైంగిక దాడి అనంతరం నిందితులు బాలికను ఢిల్లీలోని కశ్మీర్ గేట్ సమీపంలోని రింగ్ రోడ్ దగ్గర వదిలేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బాలిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు బస్సును స్వాధీనం చేసుకున్నారు. స్లీపర్ బస్సులోని బెర్త్‌లకు కర్టెన్లు ఉండటాన్ని నిందితులు తమకు అనుకూలంగా ఉపయోగించుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బస్సులో బాలికకు సంబంధించిన వెంట్రుకలను ఫోరెన్సిక్ బృందం గుర్తించింది. వాటిని ఆధారాలుగా సేకరించారు. నిందితులు ఇద్దరూ విశ్వనాథ్ ట్రావెల్స్ అనే ప్రైవేట్ సంస్థలో రెండేళ్లకు పైగా పనిచేస్తున్నట్లు సంస్థకు చెందిన ఓ ఉద్యోగి వెల్లడించినట్లు సమాచారం.

# యూపీ ఐఏఎస్ అధికారిణి ఆకస్మిక రాజీనామా



ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన 2013 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి దివ్యా మిత్తల్ తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. స్వచ్ఛందంగానే వైదొలగుతున్నానంటూ కారణాలను మాత్రం ఆమె వెల్లడించలేదు. ప్రతి ప్రభుత్వ దస్త్రం వెనుక ఒక వ్యక్తి జీవితం ఉంటుందని తన రాజీనామా సందేశంలో దివ్యా మిత్తల్ తెలిపారు. ''సమాజానికి నేనేదో ఇవ్వడానికి ఐఏఎస్‌గా వచ్చానని అనుకున్నా. అలా అనుకోవడం నా అవివేకం. ఎందుకంటే... నిజానికి నేనే అత్యధికంగా వారి నుంచి నేర్చుకున్నాను. ఆ రుణం ఎంతగానో పెరిగిపోయింద''ని సామాజిక మాధ్యమం పోస్టులో దివ్యా మిత్తల్ పేర్కొన్నారు. ''నా కోసం కన్న కలలు సాకారమయ్యాయి. ఇప్పుడు ప్రజల కోసం కంటున్న కలలు సాకారం చేయాల్సిన సమయం ఆసన్నమైంద''ని పేర్కొనడంతో ఆమె ఏమి చేయబోతున్నారన్నది చర్చనీయాంశంగా మారింది.

**లండన్‌లో ఉన్నత ఉద్యోగాన్ని వీడి...**

ఐఐటీ దిల్లీ, ఐఐఎం బెంగళూరులలో ఉన్నత విద్యను అభ్యసించిన దివ్యా మిత్తల్ లండన్‌లో ఆర్థిక నిపుణురాలుగా చేస్తోన్న ఉద్యోగాన్ని వీడి స్వదేశానికి వచ్చారు. సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. గత 13ఏళ్ల సర్వీసు కాలంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని దేవరియా, సంత్‌కబీర్ నగర్, మిర్జాపుర్‌లలో జిల్లా కలెక్టర్‌గా దివ్యా మిత్తల్ విశేష సేవలందించారు. మిర్జాపుర్ కలెక్టర్‌గా 2022 సెప్టెంబరు నుంచి 2023 సెప్టెంబరు వరకు ఏడాది పాటు మాత్రమే ఉన్నప్పటికీ స్థానిక ప్రజల మనసుల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నారు. మారుమూల కొండ ప్రాంతంలోని పల్లెకూ పైప్‌లైన్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ..'అసాధ్యమనేది వాస్తవం కాదు. అది ఒక అభిప్రాయం మాత్రమేనని మిర్జాపుర్ నాకు నేర్పించింద'ని ఆమె పేర్కొన్నారు.

దివ్యా మిత్తల్‌ను ప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేయడంతో స్థానికులు భారీ నిరసనలకు దిగారు. ఐదు నెలలపాటు ఆమెకు ఏ పోస్టూ కేటాయించలేదు. ఆ తర్వాత ఉత్తర్‌ప్రదేశ్ గ్రామీణ రహదారుల సంస్థ సీఈవోగా నియమితులయ్యారు. రాజీనామా ప్రకటించే సమయానికి రాష్ట్ర రెవిన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి పదవిలో ఉన్నారు. భవిష్యత్తు కార్యాచరణ ఏమిటో ఆమె స్పష్టం చేయలేదు. కుటుంబానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. పుస్తక రచనతో పాటు విద్యా రంగాన్ని ఎంచుకునే అవకాశం ఉందని దివ్యా మిత్తల్ సన్నిహితులు తెలిపారు.

# పోలీసుల దాష్టీకాన్ని నిలదీస్తూ పట్నాలో ఆరేళ్ల బుడతడి ధర్నా

**బిహార్‌లో నిరుద్యోగులతో కలిసి ఇటీవల నిరసన ప్రదర్శనలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనర్గళ ప్రసంగంతో అదరగొట్టిన ఆరేళ్ల బుడతడు ఆదిత్య కుమార్ మరోసారి రోడ్డెక్కాడు. తన తల్లిదండ్రులను పోలీసులు కొట్టారని ఆరోపిస్తూ పట్నాలోని గర్దనిబాగ్ ప్రాంతంలో ఆదివారం ధర్నాకు దిగాడు. ప్రధాని మోదీ జోక్యంచేసుకోవాలని డిమాండ్ చేశాడు. "నన్ను తల్లిదండ్రులకు దూరంగా 8 గంటలపాటు కస్టడీలో ఉంచి పోలీసులు వారిని కొట్టారు. నా తల్లిదండ్రులు నేరస్థులు కాదు. వారినెందుకు పోలీసులు కొట్టారు?" అంటూ ఆదిత్య కుమార్ ప్రశ్నించాడు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు తన నిరసనకు**



**మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశాడు. ప్రధాని మోదీ వచ్చి తన సమస్యను పరిష్కరించే వరకూ ధర్నా విరమించబోనని స్పష్టం చేశాడు. తన తల్లిదండ్రులను కొట్టిన పోలీసులపై దర్యాప్తు జరిపించాలని కోరుతూ శనివారం రాష్ట్ర డీజీపీ వినయ్‌కుమార్‌కు లేఖ ఇచ్చినట్లు ఆదిత్య వెల్లడించాడు. ఆగస్టు 25నాటి నిరుద్యోగుల ధర్నాలో పాల్గొన్న ఆదిత్య కుమార్‌ను కొద్ది సమయంపాటు స్టేషన్‌లో ఉంచి దినసరి కూలీలైన అతని తల్లిదండ్రులకు అప్పగించినట్లు గత వారం పోలీసులు తెలిపారు.**



# భారత్‌కు మరో 5 ఎస్-400 క్షిపణి వ్యవస్థలు

భారత గగనతల రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. మరో ఐదు ఎస్400 'సుదర్శన్' లాంగ్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ స్క్వాడ్రన్ల కొనుగోలుకు భారత్ జారీ చేసిన టెండర్‌కు రష్యా స్పందించింది. తాజాగా రష్యా ప్రభుత్వం తమ పూర్తి స్థాయి ప్రతిపాదనను భారత రక్షణ మంత్రిత్వ శాఖకు సమర్పించింది. సుమారు రూ.50 వేల కోట్లకు పైగా విలువైన ప్రతిపాదనను ప్రస్తుతం భారత రక్షణ వర్గాలు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే రష్యా నుంచి ఐదు ఎస్400 స్క్వాడ్రన్ల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకోగా నాలుగు స్క్వాడ్రన్లు భారత్‌కు అందాయి. ఐదో స్క్వాడ్రన్‌ను ఈ ఏడాది నవంబరుకు సరఫరా చేసే అవకాశం ఉందని రక్షణ వర్గాలు తెలిపాయి. కొత్త ఒప్పందం కుదిరితే డెలివరీలు ప్రారంభం కావడానికి మూడేళ్ల సమయం పట్టే అవకాశం ఉంది. వీటిని భారతదేశంలోని తూర్పు, పశ్చిమ సరిహద్దుల్లో మోహరించే అవకాశం ఉంది. దీంతో దేశ గగనతల రక్షణ సామర్థ్యం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఎస్400 వ్యవస్థలు కీలక పాత్ర పోషించినట్లు రక్షణ వర్గాలు పేర్కొన్నాయి.

# రాజ్యాంగం అనుమతించినా..వారిని జడ్జీలుగా నియమించరేం?



- 76 ఏళ్లలో న్యాయ విద్యా నిపుణులు ఒక్కరికీ అవకాశం ఇవ్వలేదు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్

న్యాయశాస్త్రంలో విద్వత్తు కలిగిన నిపుణులను సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించడం అత్యున్నత న్యాయస్థానాన్ని వైవిధ్య భరితం చేస్తుందని జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం అలాంటి నియామకానికి వీలు కల్పిస్తున్నా 76 సంవత్సరాలుగా ఒక్క న్యాయవిద్య నిపుణుడినీ సుప్రీం న్యాయమూర్తిగా నియమించకపోవడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆదివారం దిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల 13వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. ''రాజ్యాంగంలోని 124 (3)(సీ) అధికరణం ప్రకారం ఇటువంటి నియామకాలకు వీలుంది. అయినా... గత 76 ఏళ్లలో హైకోర్టు న్యాయమూర్తులు లేదా ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులు తప్ప మరెవరూ సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమితులు కాకపోవడం విచారకరం. న్యాయవిద్య నిపుణుల్లో వాస్తవ పరిస్థితుల్ని ఎదుర్కొన్న అనుభవం ఉండదన్న వాదన అర్థరహితం. పలు దేశాల్లో వీరిని రాజ్యాంగ న్యాయస్థానాల జడ్జీలుగా నియమించే పద్ధతి అమలులో ఉంది. మనదేశంలో మాత్రం హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి లేదా ప్రధాన న్యాయమూర్తిని సుప్రీంకోర్టు జడ్జీగా నియమించడం ఆనవాయితీగా వస్తోంది. కొన్ని సందర్భాల్లో బార్ అసోసియేషన్ నుంచి నేరుగా నియామకాలు జరిగాయి. ఈ రెండు వర్గాలకూ చెందని న్యాయకోవిదులు ఎవరూ సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమితులు కాలేదు. వారు కూడా చేరితే న్యాయ నిర్ణయ ప్రక్రియకు మరింత బలం చేకూరుతుంది'' అని జస్టిస్ భూయాన్ అభిప్రాయపడ్డారు.

భిన్న దృష్టికోణాన్ని వ్యక్తీకరించడంతోపాటు ఇబ్బందికరమైన ప్రశ్నలు అడిగే విద్యార్థులకు కఠిన చర్యల బూచి చూపడం తగదని జస్టిస్ భూయాన్ పేర్కొన్నారు. అలా చేయడం రాజ్యాంగ విరుద్ధమని, అది అధికార దుర్వినియోగమేనని స్పష్టం చేశారు. ఇటీవల దిల్లీలోని జంతర్ మంతర్‌లో విద్యార్థులు నిర్వహించిన నిరసన ప్రదర్శనల నేపథ్యంలో జస్టిస్ భూయాన్ మాటలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ''విశ్వవిద్యాలయమనేది గూడుకట్టుకున్న భావనల్ని పరిశీలించి... ప్రశ్నించే ప్రదేశంగా ఉండాలి. విద్యార్థుల్లో స్వేచ్ఛగా ఆలోచించే అలవాటు పెంపొందించే ప్రదేశం కావాలి. ప్రశ్నించడం ఎదురు తిరగడంతో సమానం కాదు. సహనం లేని మనస్తత్వం భారత రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం'' అని ఆయన అన్నారు.

# 'పది'తో తపాలా శాఖలో 23,757 ఉద్యోగాలు.. రిజిస్ట్రేషన్లు షురూ!




తపాలా శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలైంది. అర్హులైన, ఆసక్తికలిగిన అభ్యర్థులు ఎవరైనా నేటి (ఆగస్టు 31) నుంచి సెప్టెంబర్ 19వరకు ఆన్‌లైన్ ఓటీఆర్ చేసుకొనేందుకు పోస్టల్ శాఖ అధికారులు అవకాశం కల్పించారు. దేశ వ్యాప్తంగా వివిధ పోస్టల్ సర్కిళ్లలో గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్) పోస్టుల భర్తీకి సెప్టెంబర్ 2 నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం కల్పించారు. సెప్టెంబర్ 23, 24 తేదీల్లో దరఖాస్తుల్లో పొరపాట్లు సవరించుకోవచ్చు. దరఖాస్తు రుసుం రూ.100. మహిళలు, ఎస్సీ/ఎస్టీ, దివ్యాంగులకు దరఖాస్తు రుసుం నుంచి మినహాయింపు ఇచ్చారు.

**పరీక్ష లేదు.. వేతనం ఎంతంటే?**

**బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ / డాక్‌సేవక్ పోస్టులకు ఎలాంటి రాత పరీక్ష ఉండదు. పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఈ నియామకాలు చేపట్టనున్నట్టు తపాలా శాఖ అధికారులు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇందులో మ్యాథ్స్, ఇంగ్లిష్, స్థానిక భాష ఉండటం తప్పనిసరి. అలాగే,అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు సైకిల్ తొక్కడం రావాలి. ఆ ఉద్యోగాలను బట్టి బీపీఎంకు వేతన శ్రేణి రూ.12 వేలు -రూ.29,380; ఏబీపీఎం/డాక్ సేవక్‌కు రూ.10వేలు -24,470గా నిర్ణయించారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకొనే అభ్యర్థుల వయసు 18-40 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు చొప్పున గరిష్ఠ వయసులో సడలింపు ఉంది.**

**తెలుగు రాష్ట్రాల్లో భర్తీచేసే ఉద్యోగాలెన్నంటే..?**

దేశ వ్యాప్తంగా అన్ని పోస్టల్ సర్కిళ్లలో కలిపి మొత్తంగా 23,757 ఉద్యోగాలను భర్తీ చేస్తుండగా.. ఏపీ సర్కిల్‌లో 917, తెలంగాణ సర్కిల్‌లో 419 పోస్టులు ఉన్నాయి. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారు రోజుకు దాదాపు నాలుగు గంటల పాటు పనిచేస్తే సరిపోతుంది. అలాగే, వీటితోపాటు ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు(IPPB)కు సంబంధించిన సేవలకు గానూ ప్రత్యేకంగా ఇన్సెంటివ్ రూపంలో బీపీఎం/ఏబీపీఎం/డాక్ సేవక్‌లకు ప్రోత్సాహకాలు అందిస్తారు. వీరు రోజువారీ విధులు నిర్వర్తించడానికి ల్యాప్‌టాప్/కంప్యూటర్/స్మార్ట్ ఫోన్ లాంటివి తపాలా శాఖ సమకూరుస్తుంది. సంబంధిత కార్యాలయానికి అందుబాటులో నివాసం ఉండాలి.


## కానిస్టేబుల్‌కు రూ.7 కోట్ల జాక్‌పాట్



పంజాబ్‌లో ఓ పోలీస్ కానిస్టేబుల్‌కు లాటరీలో జాక్‌పాట్ తగిలింది. రాఖీ బంపర్ డ్రాలో రూ.7 కోట్ల ప్రైజ్ మనీని గెలుచుకున్నాడు. ఫిరోజ్‌పుర్ జిల్లా మాల్వాల్ కదీమ్ గ్రామానికి చెందిన గుర్‌ప్రీత్ సింగ్ (28).. 2022లో పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా చేరాడు. ప్రస్తుతం 112 ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నాడు.

ఇటీవల పనిమీద నగరానికి వెళ్లిన సందర్భంలో ఉద్ధమ్ సింగ్ చౌక్‌లోని ఓ ఏజెన్సీ నుంచి లాటరీ టికెట్ కొనుగోలు చేశానని, అది ఇంతటి అదృష్టాన్ని తెచ్చిపెడుతుందని అనుకోలేదని గుర్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నాడు. బంపర్ డ్రాలో మొదటి బహుమతి గెలుచుకున్నట్లు తెలియగానే ఆనందంలో మునిగిపోయానని అన్నాడు. లాటరీ విషయం తెలిసిన వెంటనే గుర్‌ప్రీత్ సింగ్ కుటుంబంతోపాటు ఆయన గ్రామంలో సంబరాలు మొదలయ్యాయి. గుర్‌ప్రీత్ సింగ్ తండ్రి రైల్వే శాఖ మాజీ ఉద్యోగి.

## భిన్నత్వంలో ఏకత్వం మన డీఎన్‌యే



భిన్నత్వంలో ఏకత్వం.. భారతదేశ డీఎన్‌యేలోనే ఉందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధినేత మోహన్ భాగవత్ చెప్పారు. దీనిని గౌరవించి, ఆమోదించి, పండగ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్ వద్ద ఇండోఅమెరికన్ల ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన దాదాపు గంట సేపు ప్రసంగించారు. అమెరికా అనగానే బహుళత్వం గుర్తుకు వచ్చినట్లే భారత్ అనగానే భిన్నత్వంలో ఏకత్వం స్ఫురిస్తుందని భాగవత్ చెప్పగానే సభా ప్రాంగణం చప్పట్లతో మార్మోగింది. ''వివేకానందుడు ప్రవచించినట్లు ప్రతి దేశానికి పూర్తిచేయాల్సిన మిషన్, చేరుకోవాల్సిన గమ్యం ఉంటాయి. భారత్ వరకు చూస్తే భిన్నత్వంలో ఏకత్వమే మా ప్రత్యేకత. ప్రపంచం నుంచి ఎంతోకొంత తీసుకుంటున్నట్లే సమాజానికి, ప్రపంచానికి తిరిగి ఇవ్వాల్సిన అవసరం ఉంది. మనం ఎంత సంపాదిస్తున్నాం అనేదానికంటే ఎంత పంచుతున్నామనేది ముఖ్యం. ప్రవాస భారతీయులంతా తమ కర్మభూమికీ విధేయులై ఉండాలి. అమెరికాలో జీవిస్తూ, ఇక్కడ సంపాదిస్తున్నవారంతా ఈ దేశం విషయంలో నిజాయతీగా ఉండాలి. జన్మభూమితో పాటు కర్మభూమిలోనూ విద్యుక్త ధర్మం నెరవేర్చాలి'' అని భాగవత్ సూచించారు. 39 రాష్ట్రాలు, 853 నగరాలకు చెందిన ప్రతినిధులు, వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు, అమెరికాలో 250 సంస్థల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు.

## గంగమ్మ ఉగ్రరూపం



ఎగువన కురుస్తున్న వర్షాలతో ఉత్తర్‌ప్రదేశ్‌లోని గంగ, యమున నదుల్లో వరద ప్రవాహం పెరిగింది. వారణాసిలోని అస్సి ఘాట్‌ను గంగా నది ముంచెత్తింది. ప్రయాగ్‌రాజ్ లోని పవిత్ర సంగమం వద్ద నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రముఖ లేటే శ్రీరామ హనుమాన్ ఆలయంలోకి గంగా నీరు చేరి, ఆంజనేయుడి పాదాలను తాకడంతో భక్తులు విశేష పూజలు, భజనలు చేశారు. మరోవైపు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు

## భాజపా భాగవత్ మాట వినాలి: దీప్కే



భాజపా భాగవత్ మాటల్ని ఆలకించాలని కాక్రోచ్ జనతాపార్టీ నేత అభిజీత్ దీప్కే సూచించారు. భాగవత్ మాటల్ని ప్రధాని మోదీ పెడచెవిన పెడుతున్నారని, అందుకే మేధో నక్సల్స్ వంటి పదప్రయోగం చేస్తున్నారని విమర్శించారు. ఆరెస్సెస్ కంటే పెద్దవాళ్లమని భాజపా అనుకుంటూ ఉంటుందని ఆయన ఎద్దేవా చేశారు. ఆరెస్సెస్ అధినేత భాగవత్ అమెరికాలో చేసిన ప్రసంగం ఆయన ద్వంద్వవైఖరిని చాటుతోందని విపక్షం ఆక్షేపించింది. విద్వేషం, మతతత్వం ఆరెస్సెస్ డీఎన్‌యేలో ఉన్నాయని కాంగ్రెస్ అధికార ప్రతినిధి షామా మహమ్మద్ ఆరోపించారు. న్యూయార్క్‌లో మాట్లాడింది భాగవత్‌యేనా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీయా అనే సందేహం కలిగిందని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ వ్యంగ్యంగా అన్నారు. భాగవత్ వ్యాఖ్యలు బయట ప్రపంచానికి ఒకలా, ఆర్ఎస్ఎస్ అంతర్గతానికి మరోలా ఉంటాయని, ఆయనది ద్వంద్వవైఖరి అని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ 'ఎక్స్' వేదికగా విమర్శించారు. భారతీయ ముస్లింలను, క్రైస్తవుల్ని అంతర్గత ముప్పుగా ఆరెస్సెస్ భావిస్తుంటుందని ఆరోపించారు.

## పార్టీని విమర్శించండి.. దేశాన్ని నిందించకండి

**రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధిపతి మోహన్ భాగవత్ న్యూయార్క్‌లో పాల్గొన్న కార్యక్రమ వేదిక బయట భారత జాతీయ పతాకాన్ని నిరసనకారులు అపవిత్రం చేయడంపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. దానికి సంబంధించిన వీడియోను 'ఎక్స్'లో పంచుకున్నారు. "ఆరెస్సెస్‌ను, భాజపాను, ప్రభుత్వాన్ని విమర్శించేందుకు మీకు స్వేచ్ఛ ఉంది. మా దేశాన్ని నిందించడానికి మాత్రం వీల్లేదు. జాగ్రత్తగా వినండి.. మా పతాకాన్ని, మా దేశాన్ని కించపరిస్తే దానికి మూల్యం తప్పదు" అని హెచ్చరించారు. మాడిసన్ స్క్వేర్ గార్డెన్ వద్ద ఖలిస్థాన్‌కు అనుకూలంగా కొందరు నినాదాలు చేస్తుండగా భారత జాతీయ పతాకాన్ని కొందరు అపవిత్రం చేస్తున్నట్లు వీడియోలో ఉంది.**




# జోరుగా జీఎస్టీ వసూళ్లు!

వస్తుసేవల పన్ను(జీఎస్టీ) వసూళ్లు 2026 జులైలో రికార్డు స్థాయిలో 2.11లక్షల కోట్ల రూపాయలను అధిగమించాయి. 2017లో జీఎస్టీ ప్రారంభించినప్పటి నుంచి ఇవి మూడో గరిష్ఠ నెలవారీ వసూళ్లు. రికార్డు స్థాయి వసూళ్ల వెనక కారణాలేంటి? ముమ్ముందూ ఇదే జోరు కొనసాగుతుందా అనేది ఆసక్తికరం!

నిరుడు జులైలో రూ.1.83లక్షల కోట్లుగా ఉన్న జీఎస్టీ వసూళ్లు ఈ ఏడాది జులైకి రెండులక్షల కోట్ల రూపాయలను దాటేశాయి. జులైలో జీఎస్టీ వసూళ్లలో రూ.32వేల కోట్లతో మహారాష్ట్ర దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. కర్ణాటక రూ.13,800 కోట్లతో, గుజరాత్ రూ.12,900 కోట్లతో రెండు, మూడో స్థానాల్లో ఉన్నాయి. జీఎస్టీ జోరుకు ఆర్థిక కార్యకలాపాల వృద్ధి, మెరుగైన పన్నుల నిర్వహణలను ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షణ, వ్యాపారాల క్రమబద్ధీకరణలనూ కారణాలుగా ఆర్థిక సర్వే పేర్కొంది. దీనివల్ల టాక్స్‌బేస్ కూడా విస్తృతమైందని వెల్లడించింది.

పెరుగుదలకు కారణాలెన్నో...

దిగుమతులపై జీఎస్టీ పెరగడం కూడా వసూళ్లలో వృద్ధికి ఒక కారణం. అయితే, జీఎస్టీ రాబడిలో పెరుగుదలకు కేవలం దిగుమతులే కాకుండా, దేశీయ వినియోగం అధికమవడం కూడా బలమైన హేతువుగా నిలుస్తోంది. బలోపేతమైన దేశీయ వినియోగం, వాణిజ్య కార్యకలాపాలు పన్ను ఆదాయం గణనీయంగా పెరగడానికి దోహదపడ్డాయి. ఇవి ఒక్కసారిగా జరిగే వృద్ధివల్ల పెరిగిన జీఎస్టీ వసూళ్లు కావు. గ్రామీణ, పట్టణ డిమాండ్ బలంగా ఉండటం జీఎస్టీ వసూళ్లకు ఊతమిస్తోంది. గ్రామీణ వేతనాలలో వృద్ధి, ఆదాయానికి ఊతమిచ్చే పథకాల వల్ల ప్రజలు ఖర్చు పెట్టడం జరుగుతోంది. పట్టణాల్లో సైతం స్థిరమైన ఉపాధితో పాటు వినియోగ సెంటిమెంట్ బలపడింది. ప్రజల చేతుల్లో ఖర్చులు పోను డబ్బు మిగులుతోంది. దీనికి కారణం కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు పన్నులు తగ్గించి ఊరట కల్పించడం. ఆహార ద్రవ్యోల్బణం కొంతమేర అదుపులో ఉండటం వల్ల కూడా అల్పాదాయ వర్గాలకు, గ్రామీణ ప్రాంత జనాభాకు ఉపశమనం లభించింది. ఎందుకంటే వీరు ఆహారంపైనే ఎక్కువ ఖర్చు చేస్తారు. ఇంతకుముందు జీఎస్టీలో దాదాపు 375 వస్తువులపై రేట్లు తగ్గాయి. దీనివల్ల వంటగదిలో వినియోగించే ఉపకరణాలు మొదలు ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్ వరకు ధరలు తగ్గాయి. వస్తువులు కాస్త చౌకగా లభించడంతో కొనుగోళ్లు పెరిగాయి. ఫలితంగా తక్కువ టాక్స్ రేట్లు ఉన్నా అధిక పరిమాణాల్లో కొనుగోళ్లు జరిగి జీఎస్టీ వసూళ్లు పెరిగాయి. పండుగల సీజన్, గ్రామీణ డిమాండ్ ఎగబాకడం కూడా పెరుగుదలకు దోహదపడ్డాయి. నిత్యావసరాలపైనే కాకుండా కావాల్సిన వాటిపై ఖర్చుపెట్టే దిశగా ప్రజల ఆలోచనలు మళ్లాయి.

ప్రజలు కేవలం ఆహారం, నిత్యావసరాలపైనే కాకుండా కార్లు, ఎలక్ట్రానిక్స్, ఇతర ఉపకరణాలు, విలాస వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి వస్తువులపై జీఎస్టీ రేట్లు ఎక్కువగా ఉండటం వల్ల వసూళ్లు పెరిగాయి. పండుగ సీజన్‌లో రికార్డు స్థాయిలో కార్ల అమ్మకాలు, దృఢమైన యూపీఐ లావాదేవీలు, ట్రాక్టర్ల అమ్మకాల్లో వృద్ధి, దేశంలో వస్తువుల చలనాన్ని సూచించే ఈ-వే బిల్లులు పెరగడం వంటివన్నీ నిజమైన వృద్ధినే చూపుతాయిగానీ, గణాంకాల మాయాజాలాలు కావు. జీఎస్టీ వసూళ్లను ఉత్పత్తి, సేవా, వర్తకం, దిగుమతి రంగాల సూచీగా పరిగణిస్తారు. అయితే త్రైమాసిక జాతీయ ఆదాయ గణాంకాలకన్నా, జీఎస్టీ లెక్కలు త్వరగా లభ్యమవుతాయి. జీఎస్టీ గణాంకాలు వ్యాపార లావాదేవీల క్రియాశీలతను, వినియోగం, పన్నులను సకాలంలో క్రమబద్ధంగా చెల్లించడాన్ని సూచిస్తాయి. కాబట్టి జులైలో విడుదలైన జీఎస్టీ అంకెలు సుస్థిర ఆర్థిక వ్యవస్థను సూచిస్తున్నట్లే లెక్క.

నిరుడు జీఎస్టీ రేట్లను సవరించి, 12 శాతం, 28 శాతం స్లాబ్‌లను తొలగించారు. అనేక వస్తువులు, సేవలను 12 శాతం నుంచి 5 శాతం స్లాబ్‌కు మార్చారు. 28శాతం స్లాబ్‌లో ఉన్న వాటిని 18 శాతానికి మార్చేశారు. కొత్తగా 40 శాతం స్లాబ్‌లోకి కొన్ని నిర్దేశిత విలాస వస్తువులను చేర్చారు. పొగాకు ఉత్పత్తులు, పాన్ మసాలా, కెఫీన్ ఉన్న పానీయాలను, 350 సీసీ ఉన్న మోటారు సైకిళ్లు, ఆన్‌లైన్ మనీగేమ్స్ వంటివాటిని చేర్చారు. అయితే జులై జీఎస్టీ వసూళ్లలోని వృద్ధి దిగుమతుల వల్లే జరిగిందన్న వాదన కూడా పరిశీలనార్హమైనది. ఈ దిగుమతులు ముడిసరకులా, పూర్తిగా తయారైన వస్తువులా, బలహీనపడిన రూపాయి మూలంగానా, ఎక్కువ పరిమాణం వల్లనా తెలియాలంటే మరింత లోతైన అధ్యయనం జరగాలి. జూన్‌లో దిగుమతుల ద్వారా జీఎస్టీ ఆదాయం దాదాపు 35 శాతం పెరిగింది. రిఫండ్లు కూడా 29శాతం ఎక్కువయ్యాయి. దీనివల్ల వ్యాపారాలకు నగదు లభ్యత పెరిగి, లిక్విడిటీ మెరుగుపడింది.

ప్రస్తుతం గడ్డుకాలమే...

ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల పవనాలు వీస్తున్నాయి. రూపాయి విలువ రోజురోజుకూ పతనమవడం ఆరోగ్యకరమైన పరిణామం కాదు. ఎల్‌నినో వాతావరణ వైపరీత్యం వల్ల వ్యవసాయానికి ఆయువు పట్టయిన నైరుతి రుతుపవనాలు నిరాశనే మిగిల్చాయి. వర్షపాతం లోటు దాదాపు 25 శాతం మించిపోయింది. దీనివల్ల వ్యవసాయం గడ్డుకాలంలో పడింది. సాగుఖర్చులు, విత్తనాలు, ఎరువులు దొరక్కపోవడం, అధిక ధరల వల్ల ఉత్పత్తి తగ్గుతుంది. తద్వారా ద్రవ్యోల్బణం పెరిగి, రిజర్వ్ బ్యాంక్ అంచనాలను దాటింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయం గణనీయంగా తగ్గుతోంది. ఉత్పత్తి రంగం చాలావరకు మధ్య ఆసియా దేశాల నుంచి ముడిసరకులను అధిక ధరలకు దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. హర్మూజ్ జలసంధి మూసివేత వల్ల ప్రత్యామ్నాయ గొలుసు సరఫరాలు ఎంచుకోవాల్సి వస్తుంది. ఇవన్నీ వ్యయ, ప్రయాసలతో కూడుకున్నవి. ఇన్ని సవాళ్ల మధ్య ముమ్ముందు జీఎస్టీ వసూళ్ల జోరు కొనసాగుతుందా లేదా అన్నది వేచి చూడాల్సిందే!




# ఆధునిక భారతానికి అతనే సర్కార్ !!

**'భారతీయ చరిత్రకారులమైన మేము, ఏ ఇతర అజెండాను అనుసరించకుండా సొంత అజెండా ప్రకారమే రాయాలనుకున్న చరిత్రలనే రాశాము. అయితే ఇది గతించిన విషయం. ఆ మేధా స్వేచ్ఛ ఇప్పుడు లభించడం లేదు. అది వేగంగా కనుమరుగవుతున్నట్లు కనిపిస్తోంది'– దశాబ్దాల తన మేధా కృషిని సింహావలోకనం చేసుకుంటూ ఆధునిక భారతదేశ చరిత్రకారుడు సుమిత్ సర్కార్ విచారగ్రస్తంగా చేసిన వ్యాఖ్యలవి.ప్రతిభావంతమైన, సూత్రబద్ధమైన భారతీయ మార్క్సిస్ట్ చరిత్రకారులలో అగ్రగణ్యుడిగా సుదీర్ఘమైన, మేధో సంపద్వంతమైన జీవితాన్ని గడిపిన సుమిత్ సర్కార్ ఇతరులు రుద్దిన మూడు చారిత్రక అజెండాలను ఎదుర్కోవలసివచ్చింది. మొదటిది– గతాన్ని ఆర్థిక నియతి దృక్కోణంలో అధ్యయనం చేసే పిడివాద మార్క్సిజం; రెండోది– పోస్ట్ మోడర్నిజం, పోస్ట్ కలోనియలిజంల అంతస్సంబంధ ధోరణి. మానవ సామాజిక ప్రవర్తన అధ్యయనంలో అత్యంత ప్రభావశీలమైన ఈ మేధో ధోరణి అమెరికాలో స్థిరపడిన లేదా ఆ దేశంలో ఉన్నత విద్యాభ్యాసం చేసిన భారతీయులను మరీ ముఖ్యంగా బెంగాలీ విద్యాధికులను విశేషంగా ఆకర్షించింది. మూడోది– సంఘ్ పరివార్ మతపరమైన మెజారిటేరియనిజం.**

పోస్ట్ మోడర్నిజం, పోస్ట్ కలోనియలిజం ఆలోచనా స్రవంతుల ప్రభావ పరిధిలోనే ఉండిపోయేందుకు సుమిత్ సర్కార్ నిరాకరించారు. ఈ రెండు అత్యాధునిక చింతనాధోరణులను తిరస్కరించడంలో సబాల్టర్న్ స్టడీస్ స్కూల్ లోని తన సహచరుల కంటే చాలా కచ్చితమైన, స్పష్టమైన వైఖరిని ఆయన తీసుకున్నారు. వ్యక్తి జీవితంలోను, సమాజ గమనంలోను ఆర్థిక శక్తులు నిర్వహించే పాత్రకు పోస్ట్ మోడర్నిజం, పోస్ట్ కలోనియలిజం తక్కువ ప్రాధాన్యమివ్వడాన్ని సుమిత్ సర్కార్ ఆమోదించలేకపోయారు. సంఘ్ పరివార్ హిందుత్వ భావజాలాన్ని ఆయన నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. గతించిన యుగాల చరిత్రపై సంఘ్ తప్పుడు అవగాహనలు, వర్తమానంలో ప్రజాస్వామ్యానికి, బహుళత్వవాదానికి వాటి వల్ల ఎదురవుతున్న విషమ పర్యవసానాల కారణంగానే సంఘ్ పరివార్ ఔదలదాల్చిన మతపరమైన మెజారిటేరియనిజంను సుమిత్ సర్కార్ అమితంగా గర్హించారు.

మార్క్సిజంతో సుమిత్ సర్కార్ సంబంధం మరింత సంక్లిష్టమైనది. మార్క్సిస్టు చింతనలోని ఆర్థిక నిర్ణయవాదంతో ఆయన పూర్తిగా ఏకీభవించలేదు. భారతదేశంలో సామాజిక అసమానతలకు కులం, జెండర్ మూల స్తంభాలని, వర్గానికి ఉన్న ప్రాధాన్యమే ఆ రెండిటికీ ఉన్నదని ఆయన గుర్తించారు. సుమిత్ సర్కార్ తన సహచర చరిత్రకారులను దృష్టిలో ఉంచుకుని రాసిన పరిశోధనా పత్రాలలో గానీ, సామాన్య పాఠకులను దృష్టిలో ఉంచుకుని రాసిన వ్యాసాలలో గానీ మార్క్సిస్టు సిద్ధాంత పరిభాష ఉండదు. నాకు తెలిసినంతవరకు ఆయన ఏ కమ్యూనిస్టు పార్టీలోనూ ఎప్పుడూ సభ్యుడిగా లేరు.

సుమిత్ సర్కార్ మొదటి పుస్తకం 'ది స్వదేశీ మూవ్‌మెంట్ ఇన్ బెంగాల్ (1903-1908) 1973లో ప్రచురితమయింది. బెంగాల్ విభజనకు ప్రతిస్పందనగా ప్రజ్వరిల్లిన ఈ స్వదేశీ ఉద్యమం యావద్భారతావనిలో రగిల్చిన అపూర్వ సామాజిక, రాజకీయ చైతన్యాన్ని ప్రతిభావంతంగా వివరించడంతో పాటు ఆ ఉద్యమ వైఫల్యాలను కూడా ఆయన నిశితంగా విశ్లేషించారు.

1997లో ప్రచురితమైన సుమిత్ సర్కార్ మరో పుస్తకం 'రైటింగ్ సోషల్ హిస్టరీ'లో బెంగాలీలకు ఆరాధ్యులు అయిన రామకృష్ణ పరమహంస, ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌పై వ్యాసాలతో పాటు రాజకీయ భావజాలాల్లో కులం నిర్వహిస్తున్న పాత్ర, తాను అభిమానించే, లేదంటే ఆమోదించలేని చరిత్ర రచనా సంప్రదాయాలపై నిశిత విమర్శలతో కూడిన వ్యాసాలున్నాయి. ప్రస్తావిత రెండు పుస్తకాలూ మళ్లీ మళ్లీ చదవవలసిన పుస్తకాలే, సందేహం లేదు. అయితే సుమిత్ సర్కార్ రచనలలో అత్యంత ప్రసిద్ధమైనది 'మోడరన్ ఇండియా: 1885-1947.' మన స్వాతంత్ర్యోద్యమంపై సమగ్రమైన, ప్రామాణికమైన రచన అది. వలసపాలన చివరి దశాబ్దాల్లో ఘటనలు, పరిణామాలు, సామూహిక జాతీయవాదం ఆవిర్భావాన్ని సుమిత్ సర్కార్ అనితరసాధ్యంగా వివరించారు. 'మోడరన్ ఇండియా' రాయడంలో తన రెండు ఉద్దేశ్యాలను ఆ పుస్తకం ముందుమాటలో ఆయన ఇలా పేర్కొన్నారు: 'మొదటిది– రాజకీయ, సామాజిక, ఆర్థిక చరిత్రలోని ప్రత్యేక సమస్యలపై ఇటీవలి కాలంలో వెలువడిన అనేక పరిశోధనా గ్రంథాలను, ఇంకా వెలికితీసిన అపార సమాచారాన్ని ఒక చోట చేర్చడం; రెండవది– నాయకుల కార్యకలాపాలు, ఆదర్శాలు లేదా వర్గ పోరాట వ్యూహాలకే జాతీయవాద చరిత్ర రచన ఇస్తున్న ప్రాధాన్యానికి ప్రత్యామ్నాయంగా.. కింది స్థాయి నుంచి (అంటే సామాన్య ప్రజల కోణం నుంచి) చరిత్రను రచించే అవకాశాలను పరిశీలించడం'. ఈ రెండు ఉద్దేశ్యాలు సంపూర్ణంగా నెరవేరాయి. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ఉపఖండంలోని అన్ని ప్రాంతాలకు ఆయన సమప్రాధాన్యమిచ్చారు. మరీ ముఖ్యమైన విషయమేమిటంటే భారత జాతీయ కాంగ్రెస్ నిర్వహించిన పోరాటాలు ఉద్యమాలకే కాకుండా, పరాయి పాలకులపై ఆదివాసీల, రైతుల తిరుగుబాట్లకు కూడా సమంజసమైన ప్రాధాన్యాన్ని సుమిత్ సర్కార్ ఇచ్చారు. హిందూ–ముస్లింల మధ్య విభేదాలు ఊపిరిపోసుకున్న తీరుతెన్నులు, దేశ విభజన విషాద ఘటనలను ఆయన గొప్ప నైపుణ్యంతో, కచ్చితత్వంతో వివరించారు. ఈ విశిష్టతల కారణంగానే, ప్రచురితమైన 43 సంవత్సరాల అనంతరం కూడా సుమిత్ సర్కార్ విరచితమైన 'మోడరన్ ఇండియా' భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రపై అత్యుత్తమ ఏక సంపుటి పుస్తకంగా వెలుగొందుతోంది.

'మోడరన్ ఇండియా'లో కులంపై సుమిత్ సర్కార్ చూపిన శ్రద్ధ మార్క్సిజంపై ఆయన సంప్రదాయ విరుద్ధ వైఖరులను స్పష్టం చేస్తోంది. అంతకంటే ముఖ్యంగా మహాత్మాగాంధీ చారిత్రక ప్రాధాన్యంపై ఆయన భావాలు, అభిప్రాయాలు వారసత్వంగా సంక్రమించిన మనో వైఖరులను ఆయన ఎంతగా విడనాడారో కూడా స్పష్టం చేస్తాయి. మహాత్మాగాంధీ అహింసాత్మక పోరాటం విప్లవ కార్యాచరణ నుంచి ప్రజలను దూరం చేసే కపట వ్యూహమని మార్క్సిస్టు సిద్ధాంతకర్తలు రజనీ పామీదత్, మానవేంద్రనాథ్ రాయ్ అభిప్రాయపడ్డారు. అలాగే మత సామరస్యానికి మహాత్ముడు ఇచ్చిన ప్రాధాన్యం వర్గ పోరాటాల నుంచి జన బాహుళ్యాన్ని వేరు చేసే యుక్తి మాత్రమేనని కూడా ఆ ఇరువురు తీవ్రంగా విమర్శించారు. అయితే సుమిత్ సర్కార్ ఆ ఇరువురితో విభేదిస్తూ గాంధీ రాజకీయాలలో చాలా లోతైన నైతిక అంశాలు ఉన్నాయని అర్థం చేసుకున్నారు. గాంధీకి సంబంధించి అహింస, సత్యాగ్రహం అనేవి 'ఒక గాఢమైన అనుభూతితో రూపుదిద్దుకున్న విశిష్ట తాత్వికతలు అని, వాటిలో మౌలికత ఉన్నదని, అది గణనీయమైనదేకాక విస్మరించరానిది'ని ఆయన స్పష్టం చేశారు. గాంధీ గురించిన సత్యాన్ని సర్కార్ సరిగానే గుర్తించారు. 'సత్యాన్వేషణే మానవ జీవిత లక్ష్యం' అని మహాత్ముడు అన్నారు. ఆయన ఇంకా ఇలా స్పష్టంగా చెప్పారు: 'అంతిమ సత్యాన్ని ఎవరూ పూర్తిగా తెలుసుకోలేరు. ఎవరికి వారు తమకు తోచిన పాక్షిక సత్యాన్ని ఇతరులపై హింస ద్వారా రుద్దడం పాపకార్యమే'. 1920ల తుది నాళ్ల పరిణామాలను చర్చిస్తూ గాంధీ గురించిన తన భిన్నాభిప్రాయాన్ని సుమిత్ సర్కార్ వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం సిద్ధించిన వేళ మతోన్మాదం పెచ్చరిల్లి, భయంకరమైన హత్యాకాండ చోటుచేసుకున్నప్పుడు హిందువులు–ముస్లింల మధ్య సామరస్యాన్ని నెలకొల్పేందుకు నౌఖాలీలో గాంధీ శాంతియాత్ర నిర్వహించారు. ఆ తరువాత ఢిల్లీ, కలకత్తాలో నిరాహార దీక్షలు చేశారు. ఈ పరిణామాలు 'మహాత్ముని అత్యుత్తమ ఘడియలు' అని సుమిత్ సర్కార్ అభివర్ణించారు. మోడరన్ ఇండియా చివరి అధ్యాయంలో ఆయన ఇలా రాశారు: 'మహాత్మాగాంధీ నిజమైన గొప్పతనం, విశిష్ట గుణాలు ఆయన జీవితం తుదినాళ్లలో స్పష్టంగా కనిపించాయి'. ప్రపంచం ముక్తకంఠంతో ఒప్పుకున్న సత్యమిది. కొత్తగా వెలుగులోకి వచ్చిన ప్రాథమిక చారిత్రక సమాచారం ఆధారంగా, అవసరమైతే తన అభిప్రాయాలను మార్చుకోవడానికి సుమిత్ సర్కార్ వెనుకాడేవారు కాదు. ఆయన గొప్ప వచన రచయిత. పదాలను గొప్ప నైపుణ్యంతో ఉపయోగించేవారు. తన భావాలను సూటిగా, స్పష్టంగా చెప్పేవారు. లయబద్ధమైన వాక్యాలను సృష్టించడంలో ఆయనకు ఆయనే సాటి. ఈ కారణంగానే ఆయన పుస్తకాలు విద్వత్ లోకాన్ని దాటి సామాన్య పాఠకులకు ప్రీతిపాత్రమయ్యాయి. సుమిత్ సర్కార్ స్ఫూర్తిదాయక అధ్యాపకుడు కూడా. ఆయన బోధనా విధానం గాంధేయ పద్ధతిలోను, ప్రజాస్వామ్యయుతంగాను ఉండేదని జర్నలిస్ట్ రావిశ్ కుమార్ ప్రశంసించారు. తన విద్యార్థుల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని సుమిత్ అంగీకరించారు.

# సైబర్ నేరగాళ్లకు సమర్థంగా పగ్గాలు

**సైబర్ నేరాలు ప్రస్తుతం అందరినీ వణికిస్తున్నాయి. వాటి నియంత్రణలో తెలంగాణ పోలీసులు మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం మొదలు నేర దర్యాప్తులోనూ వారు తమదైన ముద్ర చాటుకుంటున్నారు.దేశంలో సైబర్‌నేరాల దర్యాప్తు తీరుతెన్నులపై ప్రధానమంత్రి కార్యాలయం ఇటీవలి 'ప్రగతి' సమీక్ష పేరిట వెలువరించిన ఫలితాల్లో తెలంగాణ తొలిస్థానం దక్కించుకుంది. తొమ్మిది ప్రామాణిక అంశాల్లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఈ ఫలితాలను వెల్లడించారు. దేశంలోనే తొలిసారి స్టేట్ సైబర్‌క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్(ఎస్4సీ) పేరిట తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ)ను మూడేళ్ల క్రితం ఏర్పాటు చేయడం ఈ ఫలితాల సాధనకు దోహదం చేసింది. టీజీసీఎస్‌బీ ఏర్పాటుకు ముందు సైబర్ నేర బాధిత రాష్ట్రాల్లో తెలంగాణ ముందుండేది. అప్పట్లో ఉత్తరాదిన సైబర్‌నేరాలకు పేరుమోసిన జామ్‌తారా(ఝార్ఖండ్), భరత్‌పుర్(రాజస్థాన్)ల నుంచి ఆన్‌లైన్ మోసగాళ్లు తెలంగాణ వాసులపై ఎక్కువగా వల విసిరేవారు. ఇక్కడి ప్రజల్లో చాలా మందికి హిందీ తెలిసి ఉండటంతో సైబర్‌ముఠాలు వారిని లక్ష్యంగా చేసుకునేవి. ఈ క్రమంలో 2020-24 మధ్య తెలంగాణాలో**




**సైబర్‌నేరాలు ఎక్కువగా జరిగినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయితే, యంత్రాంగం చొరవతో పరిస్థితి మారింది. ఈ ఏడాది ప్రథమార్ధంలో సైబర్ నేరాల విషయంలో తెలంగాణ 11వ స్థానంలో నిలిచింది. దీన్నిబట్టి ఆన్‌లైన్ మోసాలు నియంత్రణలోకి వచ్చాయని అర్థమవుతుంది.**

వేగంగా ఎఫ్ఐఆర్‌లు

సైబర్ నేర ఫిర్యాదులను ఎఫ్ఐఆర్‌లుగా మలచడంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ఈ ఏడాది ప్రథమార్ధంలో దేశవ్యాప్తంగా సైబర్(ఆర్థిక) నేరాల్లో బాధితులు రూ.9,594కోట్లు పోగొట్టుకున్నారు. వాటిపై 12.84 లక్షల ఫిర్యాదులు అందితే, కేవలం 19,915 ఎఫ్ఐఆర్‌లు మాత్రమే నమోదయ్యాయి. తెలంగాణ విషయానికొస్తే సైబర్ నేర బాధితులు రూ.616 కోట్లు కోల్పోయారు. వారి నుంచి 44,900 ఫిర్యాదులందాయి. వాటిపై 7,467 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. ఈ విషయంలో దేశవ్యాప్త సగటు 1.56శాతంతో పోలిస్తే తెలంగాణ 16.64శాతంతో చాలా ముందంజలో ఉంది. ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తే బాధితులకు న్యాయం జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. సైబర్‌నేరాలపై ఫిర్యాదులకు ఉద్దేశించిన టోల్‌ఫ్రీ నంబర్ 1930కు వచ్చే ఫోన్‌కాల్స్‌ను ఎస్4సీ సిబ్బంది కృత్రిమమేధ సాయంతో రియల్‌టైంలో నమోదుచేస్తూ అప్పటికప్పుడే సంబంధిత ఠాణాలకు బదిలీ చేస్తున్నారు. ఫిర్యాదులోని తీవ్రతను బట్టి వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశం ఏర్పడుతోంది.

బాధితులు వెంటనే 1930కు ఫోన్‌చేస్తే కాల్‌సెంటర్ సిబ్బంది అప్రమత్తమై డబ్బు బదిలీ అయిన బ్యాంకు ఖాతాలను స్తంభింపజేస్తున్నారు. తద్వారా నేరస్థులు నగదును ఉపసంహరించకుండా అడ్డుకుంటున్నారు. ఆ సొమ్మును బాధితులకు తిరిగి ఇప్పించడంలో ఈ ఏడాది జులై నాటికి 81శాతం పనితీరుతో తెలంగాణ దేశంలోనే తొలిస్థానంలో నిలిచింది. రూ.50వేలకన్నా తక్కువగా పోగొట్టుకున్న బాధితులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తే చాలు ఠాణాలు, న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే సొమ్మును తిరిగి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. టీజీసీఎస్‌బీ ఏర్పడిన నాటి నుంచి ఈ ఏడాది జూన్ 20నాటికి అలా 59,593 మంది బాధితులకు రూ.445.4కోట్లను తిరిగి ఇప్పించగలిగారు. అంతే కాకుండా సైబర్ నేరాల్లో ప్రత్యక్ష ప్రమేయం లేనప్పటికీ బ్యాంకు ఖాతాలు స్తంభించిపోయినప్పుడు వాటిని విడిపించడానికి సంబంధించిన 88శాతం ఫిర్యాదులను పరిష్కరించడం ద్వారా ఆ విభాగంలోనూ తెలంగాణ పోలీసులు అగ్రస్థానంలో నిలిచారు.

భారీగా అరెస్టులు

ఉత్తరాది నుంచి సైబర్ నేర ముఠాలను పట్టుకొచ్చేందుకు తెలంగాణ పోలీసులు రోజుల తరబడి ఆపరేషన్లు చేపడుతున్నారు. 2024 సెప్టెంబర్‌లో రాజస్థాన్‌లో 27 మందిని, 2025 మేలో గుజరాత్‌లో 20 మందిని ఖైదు చేశారు. ఈ ఏడాది మేలో కేరళ, మహారాష్ట్ర, ఏపీ, తమిళనాడు, కర్ణాటకల్లో 81మందిని అరెస్ట్ చేశారు. దేశవ్యాప్తంగా ఈ నిందితులకు 3,492 నేరాల్లో ప్రమేయమున్నట్లు గుర్తించి ఆయా రాష్ట్రాలకు సమాచారం అందించారు. మరోవైపు సైబర్‌నేరాలపై అవగాహనలోనూ టీజీసీఎస్‌బీ ముందుంటోంది. ఇప్పటివరకు ఎనిమిదిన్నర లక్షల మందికి పైగా ప్రజల్లో చైతన్యం నింపింది. సైబర్‌భద్రతపై అవగాహన కల్పించేందుకు, ఆన్‌లైన్ నేరాల కట్టడిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా నెలరోజుల పాటు 'సైబర్ సురక్షా కా తిరంగా' కార్యక్రమాన్ని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఇటీవల ప్రారంభించారు. ఇలాంటి ప్రయత్నాలే తెలంగాణ పోలీసుల్ని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. అయితే, మొత్తం సైబర్ నేరాల్లో 60శాతానికి పైగా ఇన్వెస్ట్‌మెంట్ మోసాలే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో బాధితులు అత్యాశకు పోకుండా అప్రమత్తంగా ఉంటే, చాలావరకు సైబర్ నేరాలు నియంత్రణలోకి వస్తాయని పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు.

# సామాజిక మాధ్యమాల పాపమిది!

**చక్కగా చదువుకోవాలి, ప్రాజెక్టు వర్కులు తొందరగా పూర్తిచేయాలి, పరీక్షలు బాగా రాయాలి, స్నేహితులతో సరదాగా గడపాలి... పాఠశాల పిల్లల మనసుల్లో సాధారణంగా ఇలాంటి ఆలోచనలే ఉంటాయి కదా? కానీ, బాల్యం కట్టుతప్పతోంది. దేశానికి దిక్సూచిగా నిలవాల్సిన భావితరం దురదృష్టవశాత్తు నేరాల బాటపడుతోంది. ఆటపాటలు, పుస్తకాల్లో మునిగిపోవాల్సిన చిన్నారుల్లో చాలామంది ధూమపానం, మత్తుపదార్థాలకు చేరువవుతున్నారు. గంటలకొద్దీ సామాజిక మాధ్యమాల్లో గడుపుతూ విపరీత పోకడలను అలవర్చుకుంటున్నారు. కొంతమందైతే దుర్వ్యసనాల గుప్పిట్లోచిక్కి విచక్షణారహితంగా ప్రవర్తిస్తున్నారు. ఇలాగే దారితప్పిన ఇద్దరు పదోతరగతి బాలురు నల్గొండ జిల్లాలో దారుణానికి ఒడిగట్టారు. బుద్ధిమార్చుకోవాలని మందలించిన పాఠశాల ప్రిన్సిపల్‌ను**



**ఘోరంగా కడతేర్చారు. తేలిగ్గా డబ్బు సంపాదించడం, హత్యచేసి తప్పించుకోవడం లాంటి విషయాలను వారు సోషల్ మీడియాలో వెతికినట్లు పోలీసులు చెబుతున్నారు. లోకం పోకడ సరిగ్గా తెలియని ప్రాయంలోనే వారంత క్రూరులుగా ఎలా మారారు? తాజాగా కేరళలోనూ డబ్బులకోసం నలుగురు బాలలు ఓ వ్యక్తిని అంతమొందించారు. ఓటీటీలు, యూట్యూబ్‌లో హారర్ సినిమాలు చూసిన ప్రేరణతో నిరుడు హైదరాబాద్‌లో టెన్త్ పిల్లాడు ఒక చిన్నారిని హతమార్చాడు. నవతరం మెదళ్లు ఇంతగా కుళ్లిపోతుంటే దేశం గతేమవుతుంది?**

తల్లిదండ్రులూ, ఉపాధ్యాయుల పర్యవేక్షణ లేకపోవడంతో పిల్లలెందరో చెడు సావాసాల్లో కూరుకుపోతున్నారు. సోషల్ మీడియాలో తలమునకలవుతూ కుంగుబాటు, నిద్రలేమి సమస్యల్లోకి జారిపోతున్నారు. రీల్స్, షార్ట్స్ యావలో చదువును నిర్లక్ష్యం చేస్తున్నారు. మంచీచెడూ గుర్తించలేని వయసులో ఇన్‌స్టా, ఇతర మాధ్యమాల్లో అపరిచితుల ఆకర్షణలో పడి జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారు. పలువురు పిల్లల ఆలోచనా ధోరణులను ప్రస్తుతం సోషల్ మీడియానే నిర్దేశిస్తోంది. అందులోకి పోటెత్తుతున్న అశ్లీల, హింసాత్మక కంటెంట్‌ను అడ్డుకోవడానికి, పిల్లలను దానికి దూరంగా ఉంచడానికి ఆయా సంస్థలు చిత్తశుద్ధితో పాటుపడటమే లేదు. పైగా, వ్యాపార ప్రయోజనాలే పరమావధిగా బడా కంపెనీలు ప్రత్యేక అల్గారిథమ్‌లతో చిన్నారులను తమ యాప్‌లకు బానిసలుగా మార్చుకుంటున్నాయన్న కథనాలూ వెలువడ్డాయి. 'మెటా' విషయంలో అదే అభియోగాలతో అమెరికాలోని 29 రాష్ట్రాలు కలిసి ఇటీవల కోర్టు మెట్లెక్కాయి. సామాజిక మాధ్యమాల విష ప్రభావంతో బాలల జీవితాలు అంధకారంలోకి జారిపోకుండా మన ప్రభుత్వాలూ జాగ్రత్త వహించాలి!

పరిశీలనల ప్రకారం, ఇండియాలో ప్రతి ముగ్గురు బాలబాలికల్లో ఒకరు సోషల్ మీడియాకు అలవాటుపడ్డారు. వారిలో 14శాతం మంది మరింతగా ఆ ఊబిలో చిక్కుకుపోయారు. సామాజిక మాధ్యమాల వల్ల ఎన్నో అనర్థాలు దాపురిస్తున్న నేపథ్యంలో మలేసియా, ఆస్ట్రేలియా, ఇండోనేసియా వంటివి పదహారేళ్లలోపు చిన్నారులకు వాటిని నిషేధించాయి. మరికొన్ని దేశాలు ఆంక్షలు విధించాయి. చిన్నారుల శ్రేయస్సు దృష్ట్యా సోషల్ మీడియా వాడకంపై వయసుల వారీగా పరిమితులు విధించాలని కేంద్ర ఆర్థిక సర్వే సైతం సూచించింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ వంటివి ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు ప్రకటించాయి. భావాలను పంచుకోవడానికి, ప్రపంచవ్యాప్త పరిణామాలను తెలుసుకోవడానికి, నైపుణ్యాలను పెంచుకోవడానికి సోషల్ మీడియా వేదికలు తోడ్పడతాయి. సామాజిక కల్లోలాలకు కారణం కాకుండా అవి సద్వినియోగం కావాలంటే ఏఐ సాయంతో అనుచిత కంటెంట్‌ను ఎప్పటికప్పుడు తొలగించే వ్యవస్థలను ఆ సంస్థలు కొలువుతీర్చాలి. వ్యాపార లాభాలకోసం అసభ్య, అవాంఛనీయ దృశ్యాలను, నేరాలకు ప్రేరేపించే కంటెంట్‌ను అనుమతించే కంపెనీలపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలి!

## టెన్నిస్ టోర్నమెంట్ కు నూరు సంవత్సరాలు



**- ప్రారంభించిన డి.ఎస్.పి.. జగన్నాథ రాజు**

**ధర్మవరం ఆగస్టు 31, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణములోని బ్రాహ్మణ వీధిలో గల టెన్నిస్ టోర్నమెంట్ నూరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఎస్పి. జగన్నాథ రాజు టెన్నిస్ కోర్టును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రూరల్ సీఐ ప్రభాకర్, భూటాన్ సిఐ జయ నాయక్, సీనియర్ క్రీడాకారులు బండి రాము, రమేష్, శివ తదితరులు పాల్గొని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం క్రీడాకారులు మాట్లాడుతూ..... క్రీడలలో టెన్నిస్ చాలా ముఖ్యమైనదని, వేలాదిమంది క్రీడాకారులు మంచి తర్ఫీదును కళాజ్యోతిలో శిక్షణ పొందడం జరిగిందన్నారు. ఎంతోమంది స్పోర్ట్స్ కోటాలో కూడా ఉద్యోగాలు పొందడం జరిగిందని తెలిపారు. అనంతరం డి.ఎస్.పి. జగన్నాథ రాజు మాట్లాడుతూ క్రీడాకారులకు ఇంతటి ప్రాముఖ్యత ఇవ్వడం, అది కూడా టెన్నిస్ నూరు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఒక పండుగలాగా కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల వారు అభినందనలు తెలియజేశారు.

## ఫిన్లాండ్ శిక్షణతో విద్యాభివృద్ధికి కృషి



**అనంతగిరి, ఆగస్టు 31 (అనంత జన శక్తి న్యూస్):**

ఫిన్లాండ్‌లో పది రోజులపాటు ప్రత్యేక శిక్షణ పూర్తి చేసుకుని స్వదేశానికి చేరుకున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు శెట్టి రాంబాబుకు చిలకలగడ్డ ఆశ్రమ పాఠశాలలో ఘన సన్మానం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారి సైమన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను అభినందించారు .ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. ఫిన్లాండ్‌లో పిల్లల కేంద్రీకృత అభ్యాసం, ఆనందదాయక బోధన, ఆటల ఆధారిత విద్య, వినూత్న తరగతి గది పద్ధతులపై శిక్షణ పొందినట్లు తెలిపారు. అక్కడ నేర్చుకున్న ఆధునిక బోధనా విధానాలను రాష్ట్ర విద్యార్థులకు అందించి విద్యా నాణ్యత పెంపొందించేందుకు కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాకోలపు గుప్తా, చెట్టి లక్ష్మణ్, గుడివాడ గంగాప్రసాద్, పరశురామ్ శేఖర్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన శ్రేణులు సమాయత్తం



**అనంతగిరి, ఆగస్టు 31 (అనంత జన శక్తి న్యూస్):**

స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు అనంతగిరి మండల విస్తృత స్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు చిట్టం మురళి అధ్యక్షతన జరిగిన సమావేశానికి అరకు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి చెట్టి చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ప్రతి పంచాయతీలో పార్టీ పరిస్థితిని సమీక్షించి, ప్రజా సమస్యలపై పోరాడాలని చెట్టి చిరంజీవి పిలుపునిచ్చారు.నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి స్థానిక ఎన్నికల్లో పార్టీకి మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు.మండల అధ్యక్షుడు చిట్టం మురళి మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీలో జనసేనను బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న నాయకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

## అనంతగిరిలో గిరిజన రైతులకు వెదురు మొక్కల పంపిణీ

**- 85 మంది రైతులకు 5,100 మొక్కలు**

**అనంతగిరి, ఆగస్టు 31 (అనంత జనశక్తి న్యూస్):**

గిరిజన రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించే లక్ష్యంతో అనంతగిరి మండల కేంద్రంలోని ఎఫ్‌పీవో కార్యాలయంలో 85 మంది రైతులకు 5,100 వెదురు మొక్కలను పంపిణీ చేశారు. వెలుగు ఏపీఎం శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. రైతులను గ్రామాల వారీగా గ్రూపులుగా ఏర్పాటు చేసి ఎఫ్ఎస్‌సీ సర్టిఫికెట్ అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెదురు తోటల్లో అంతర పంటలు సాగు చేసుకోవచ్చని, నాలుగో సంవత్సరం నుంచి దీర్ఘకాలికంగా ఆదాయం పొందవచ్చన్నారు. ఎఫ్ఎస్‌సీ సర్టిఫికెట్ ఉన్న వెదురుకు సాధారణ వెదురుతో పోలిస్తే అధిక ధర లభించే అవకాశం ఉందన్నారు.వెదురు పంటకు మార్కెటింగ్ సమస్య ఉండదని, సెర్ప్ ఆధ్వర్యంలోని మారేడుమిల్లి పీపీయూనిట్‌కు విక్రయించుకోవచ్చని తెలిపారు. భవిష్యత్తులో అల్లూరి సీతారామరాజు జిల్లాకు సమీపంలో పీపీయూనిట్ ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో ఎఫ్‌పీజీసీసీ సూరిబాబు, సీసీలు, అకౌంటెంట్, వీఓఏలు, డ్వాక్రా సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



# వందేళ్లు నిలిచేలా సేవా కార్యక్రమాలు

**- ధర్మవరం ప్రజల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు పరిటాల శ్రీరామ్......**

**ధర్మవరం ఆగష్టు 31 అనంత జనశక్తి న్యూస్ :**



టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర పేరు వందేళ్లు నిలిచేలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ధర్మవరం మున్సిపాలిటీకి రెండు చెత్త తరలించే ఎలక్ట్రికల్ వాహనాలను ఆయన అందజేశారు. పట్టణంలోని నేసేపేట పుట్లమ్మ ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌కు వాహనాలను అప్పగించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, స్థానిక పట్టుచీరల వ్యాపారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ, పరిటాల రవి ఏ కార్యక్రమం చేపట్టినా మొదటగా అండగా నిలిచింది ధర్మవరం ప్రాంత ప్రజలేనని అన్నారు. ట్రస్టు ద్వారా చేపట్టే ప్రతి కార్యక్రమానికి ఈ ప్రాంత ప్రజలు, వ్యాపారులు ఎంతో సహకారం అందిస్తున్నారని తెలిపారు. కర్నూలు వరదల సమయంలో రెండు గ్రామాలను దత్తత తీసుకున్నప్పుడు ధర్మవరం ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సహాయం అందించారని గుర్తు చేశారు. ధర్మవరం దాతృత్వానికి, దాతలకు నిలయంగా ఉందని శ్రీరామ్ అన్నారు. పరిటాల రవీంద్ర ట్రస్టు ద్వారా వివాహాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించినప్పుడు కూడా ఈ ప్రాంత ప్రజల భాగస్వామ్యం ఎంతో ఉందని తెలిపారు. ధర్మవరం ఒక ప్రముఖ వ్యాపార, వాణిజ్య కేంద్రంగా, సిల్క్ సిటీగా అభివృద్ధి చెందిందని, ఇక్కడ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిరోజూ వేలాది మంది వ్యాపారులు పట్టణానికి వస్తుంటారని, స్థానికంగా సుమారు లక్షన్నర జనాభా ఉందని చెప్పారు. దీంతో చెత్త ఎక్కువగా పేరుకుపోతుండగా, మున్సిపాలిటీ వద్ద ఉన్న వాహనాలు సరిపోని పరిస్థితి ఉందన్నారు. చిన్న చిన్న సందుల్లోకి కూడా వెళ్లేలా ఈ ఎలక్ట్రికల్ వాహనాలను రూపొందించారని, చెత్త బరువును మోయగల సామర్థ్యం ఉందా లేదా అన్నది పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేశామని శ్రీరామ్ తెలిపారు. ప్రస్తుతం నేసేపేట, తేరు బజార్ వంటి వాణిజ్య ప్రాంతాల్లో వినియోగించేందుకు వాహనాలను అందించామని, ఇవి సమర్థవంతంగా పనిచేస్తే ధర్మవరం మున్సిపాలిటీలోని ప్రతి డివిజన్‌కు ఇలాంటి వాహనాలను అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సింగపూర్ వంటి దేశాల్లో చెత్త ఎక్కడా కనిపించదని, ఎవరైనా చెత్త వేస్తే జరిమానాలు విధిస్తారని తెలిపారు. అలాంటి పరిశుభ్రతా సంస్కృతి ధర్మవరంలో కూడా రావాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ రోడ్లపై ఉన్న చెత్తను తొలగించకపోయినా, తమ చేతుల్లోని చెత్తను రోడ్లపై వేయకుండా చెత్తబుట్టలో వేయాలని సూచించారు. పరిశుభ్రత మన నుంచే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. పరిటాల రవితో సన్నిహితంగా ఉన్నవారు పెనుకొండ, రాప్తాడు ప్రాంతాల కంటే ధర్మవరంలోనే ఎక్కువగా ఉన్నారని, వారి సలహాలు, సూచనలతో మరింత ముందుకు సాగుతానని శ్రీరామ్ తెలిపారు. ఒకప్పుడు పరిటాల రవి ధర్మవరంలో ఉన్న చెత్తను స్వయంగా ఊడ్చి తొలగించారని, ఇప్పుడు ఆయన ట్రస్టు పేరుతో అసలైన చెత్తను తొలగించే కార్యక్రమాలను చేపడతామని అన్నారు.

# ఐసీడీఎస్ అవినీతిపై లోకాయుక్తకు సమగ్ర ఫిర్యాదు.

**- న్యాయపోరాటం తీవ్రతరం.**
**- బిఎస్పీ జిల్లా అధ్యక్షుడు సాకే వినయ్ కుమార్**
**- కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు మరియు విజిలెన్స్ విచారణ ధృవీకరణ**
**- లోకాయుక్త ముందర ఉంచిన ప్రధాన అక్రమాలు మరియు ఆధారాలు**

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,**
**ఆగస్టు 31, అనంత జనశక్తి న్యూస్:**

పుట్టపర్తిలో సోమవారం బహుజన్ సమాజ్ పార్టీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు మరియు ధర్మవరం నియోజకవర్గ ఇంచార్జ్ సాకే వినయ్ కుమార్ మాట్లాడుతూ.... శ్రీ సత్యసాయి జిల్లా మహిళా సమగ్ర అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖలో జరిగిన తీవ్రస్థాయి అక్రమాలు, అధికార దుర్వినియోగం, నిధుల మళ్లింపు మరియు ఉద్యోగులపై మానసిక వేధింపులపై ఆంధ్ర ప్రదేశ్ గౌరవ లోకాయుక్తలో అధికారికంగా సమగ్ర ఫిర్యాదు సమర్పించి,న్యాయపోరాటాన్ని తదుపరి దశకు తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఐసీడీఎస్ శాఖలో జరుగుతున్న దోపిడీపై తాము సాగించిన వరుస పోరాటాల ఫలితంగా కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు విచారణలు వేగవంతం చేశాయని స్పష్టం చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి కే. ప్రమీల అవినీతిపై తాము కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు అందించిన ఆధారాలతో కూడిన ఫిర్యాదుపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించి, వెంటనే సమగ్ర విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించిందని వివరించారు. ఈ కేంద్ర ఆదేశాల మేరకు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సంచాలకులు విచారణ జరిపి, ఆంధ్రప్రదేశ్ సివిల్ సేవల నియమావళి ప్రకారం తీవ్రమైన అభియోగాలతో ప్రాజెక్ట్ అధికారి కే. ప్రమీలపై అధికారిక జులై 31 న,ఛార్జ్ మెమో జారీ చేస్తూ, 10 రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారని గుర్తుచేశారు. అంతేకాకుండా, ఈ సమగ్ర అవినీతిపై రాష్ట్ర విజిలెన్స్ విభాగం చేపట్టిన విచారణ పురోగతి సమాచారాన్ని సాధారణ పరిపాలనా విజిలెన్స్ శాఖ సమాచార హక్కు చట్టం ద్వారా అధికారికంగా ధృవీకరిస్తూ ఆధారాలు అందించిందని వెల్లడించారు.

ప్రభుత్వ విచారణ నివేదికలు మరియు విజిలెన్స్ రికార్డులను ప్రధాన ఆధారాలుగా జతచేస్తూ ఏపీ లోకాయుక్తలో జిల్లా ప్రాజెక్ట్ అధికారి కే. ప్రమీల మరియు జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్‌లపై ఫిర్యాదు దాఖలు చేసినట్లు తెలిపారు. సక్షమ్ అంగన్‌వాడీ పథకం కింద జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు గాను రూ. 29.56 లక్షల విలువైన అనేక రకాల స్టీల్ సామాగ్రి, పాత్రలు కొనుగోలు చేసే ప్రక్రియలో నిబంధనల ప్రకారం కొత్తగా ఇటెండరింగ్ నిర్వహించకుండా, పాత రేట్లతోనే ఆర్డర్లు ఇచ్చి నిధులు మళ్లించారని ఆరోపించారు. అలాగే బేటీ బచావో బేటీ పఢావో పథకం కింద ఆర్థిక శాఖ నుండి ఎలాంటి ముందస్తు అనుమతులు పొందకుండా, ప్రభుత్వ నియమాలను పక్కనబెట్టి నిబంధనలకు విరుద్ధంగా ప్రచార డిజిటల్ వాహనాన్ని కొనుగోలు చేశారని వివరించారు. దీనికి తోడు సీసీ కెమెరాల కొనుగోళ్లలో, నెలవారీ కార్యాలయ ఖర్చుల నిధుల్లో జరిగిన గోల్‌మాల్‌పై, అలాగే సీడీపీఓలు, కార్యాలయ సిబ్బంది, మహిళా ఉద్యోగులపై జరుగుతున్న మానసిక వేధింపులు, విరుద్ధమైన డిప్యుటేషన్లు మరియు కక్షసాధింపు బదిలీలపై లోకాయుక్తకు పూర్తి ఆధారాలు సమర్పించామని చెప్పారు.

ప్రజాధనం దుర్వినియోగాన్ని ప్రశ్నించినందుకే తనపై కక్ష సాధింపు ధోరణితో కోటి రూపాయల నష్టపరిహారం కోరుతూ లీగల్ నోటీసు పంపడమే కాకుండా, పుట్టపర్తి కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ "నీ పిల్లలు అంగన్‌వాడీలో చదువుతున్నారా" అని బహిరంగంగా బెదిరింపులకు దిగారని మండిపడ్డారు. అంతేకాకుండా క్రిమినల్ కేసులు బనాయించి జైలుకు పంపుతామని బెదిరించారని, ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా ఐసీడీఎస్ అవినీతిని వెలికితీస్తున్నందుకు కలెక్టర్ మరియు ప్రాజెక్ట్ అధికారులు కలసి చేసిన ఈ అధికారిక దుర్వినియోగం, వేధింపులపై ఇప్పటికే జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు పూర్తి వివరాలతో ఫిర్యాదు సమర్పించామని చెప్పారు.

ఈ నేపథ్యంలో లోకాయుక్త ప్రత్యేక బృందాలు నేరుగా రంగాన దిగి, శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన స్టీల్ సామాగ్రి నాణ్యత, పరిమాణం మరియు ఐసీడీఎస్ బ్రాండింగ్‌ను సంపూర్ణంగా భౌతిక తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విరుద్ధంగా కొనుగోలు చేసిన వాహనం రిజిస్ట్రేషన్ పత్రాలు, లాగ్‌బుక్, ఒరిజినల్ టెండర్ ఫైళ్లు,



ఖజానా బిల్లులు మరియు స్టాక్ రిజిస్టర్లను లోకాయుక్త తక్షణమే తమ స్వాధీనంలోకి తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ చిన్నారులు, గర్భిణుల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను పక్కదారి పట్టించిన అధికారులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుని, దుర్వినియోగమైన ప్రభుత్వ ధనాన్ని పూర్తిగా రికవరీ చేసే వరకు బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈ న్యాయపోరాటం కొనసాగుతుందని సాకే వినయ్ కుమార్ స్పష్టం చేశారు.

## అటవీ సంపదపై అక్రమ రవాణా ముద్ర!

**కలపతో బొలేరో బోల్తా.. స్థానికుల్లో ఆందోళన**

**అనంతగిరి, ఆగస్టు 31 (అనంత జనశక్తి న్యూస్):**

**అనంతగిరి అటవీ ప్రాంతంలో భారీగా కలపను తరలిస్తున్నట్లు అనుమానిస్తున్న బొలేరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఏపీ 39 డబ్ల్యుక్యూ 1021 నంబరు గల వాహనంలో పెద్ద మొత్తంలో కలప ఉన్నట్లు స్థానికులు తెలిపారు.అటవీ ప్రాంతాల్లో విలువైన వృక్షాలను రాత్రివేళల్లో నరికివేసి అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై అటవీ అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి కలప ఎక్కడి నుంచి వచ్చింది, ఎక్కడికి తరలిస్తున్నారు, దీని వెనుక ఉన్న వ్యక్తులెవరనే విషయాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.అక్రమ నరికివేత, కలప రవాణాను అరికట్టి అటవీ సంపదను కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.**



# మేడికుర్తి లో స్వల్ప ఉద్రిక్తత....



**- చిలమకూరులో దాడి ఒకరి పరిస్థితి విషమం**

**యల్లనూరు, ఆగస్టు 31, అనంత జనశక్తి న్యూస్;**

మండలంలోని మేడికుర్తి గ్రామంలో సోమవారం స్వల్ప ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తాడిపత్రి మాజీ మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి మండల పర్యటనను చేపట్టారు ఇందులో భాగంగా సోమవారం మేడికుర్తి గ్రామంలో పర్యటిస్తుండగా టిడిపికి చెందిన రామకృష్ణ రెడ్డి తన ఇంటి ముందు ఉన్న ముళ్ళకంప చెట్టును తొలగించాలంటూ జెసి ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగ వెంటనే ఆయన అటుగా వెళుతున్న రంపకోత వ్యక్తిని పిలిచి చెట్టును కోయించేశారు. అయితే టిడిపికి చెందిన రామకృష్ణ రెడ్డి ఇంటి ముందు ఉన్న ఖాళీ స్థలము వైసీపీకి చెందిన రామచంద్రారెడ్డిది ఈ స్థలంలో 20 సంవత్సరాలు వయసుగల ముల్లకంప చెట్టు ఉంది. చెట్టును నరికే వేస్తున్నారని సమాచారంతో సదరు వ్యక్తులు అక్కడికి చేరుకున్నారు చెట్టున్నరకి వేస్తున్న దృశ్యాలను సెల్లులో చిత్రీకరిస్తుండగా మరో వ్యక్తి దాన్ని అడ్డుకొని సెల్లులు లాక్కున్నాడు ఈ సందర్భంలో వారి మధ్య తీవ్ర వివాదం చోటుచేసుకుంది దీంతో టీడీపీకి చెందిన కొందరు వ్యక్తులు వైసీపీకి చెందిన సాయికుమార్ రెడ్డి రామకృష్ణారెడ్డి వెంకటేశ్వరములపై దాడి చేయడంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి అక్కడే ఉన్న ఎస్ఐ ఈ సిఐ సత్యబాబు ఇరు వర్గాలకు సర్ది చెప్పి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

**మా చెట్టుపై మీ పెత్తనం ఏంటి..**

అయితే తమ సొంత ఖాళీ స్థలంలో ఉన్న చెట్టును కొట్టే హక్కు మీకు ఎవరు ఇచ్చారు అంటూ వైసీపీ నేతలు మండిపడ్డారు. ఈ చెట్టు వ్యవహారమై గతంలోనే పోలీసులు తమను పిలిపించాలని అయితే ప్రస్తుతం ఇంటిని నిర్మించుకుంటున్నాము అందుకు అవసరమైన సామాగ్రిని ఈ కాలీ స్థలంలో నిలువ చేసుకున్నాము, కొన్ని రోజులు నీడ పాటు ఉంటుందని ఇల్లు పూర్తి అయిన తర్వాత చెట్టును తామే తొలగిస్తామంటూ పోలీసులకు చెప్పడం జరిగిందన్నారు. ఈ ఘర్షణ నేపథ్యంలో గ్రామంలో పోలీసులు ఫికెట్ ను ఏర్పాటు చేశారు

**చిలమకూరులో.....**

**చిలమకూరు గ్రామంలో జేసీ పర్యటన సాగుతుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై అటుగా వెళ్లారు. అయితే అప్పటికే మద్యం సేవించి ఉన్న వారిని గమనించిన జేసి ప్రభాకర్ రెడ్డి మీకు లైసెన్స్ ఉందా అంటూ సంబోధించగా ద్విచక్ర వాహనంలో ఉన్న వారు ఇది హైవే రోడ్డు కాదని మా స్వగ్రామం అంటూ సమాధానం ఇవ్వడంతో అక్కడే ఉన్న టిడిపికి చెందినవారు వారిపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో వైసీపీకి చెందిన భాస్కర్ తీవ్ర గాయాల పాలయ్యారు. మరో వ్యక్తి శీనుకు స్వల్ప గాయాలయ్యాయి. భాస్కర్ పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.**

## శివాలయాలలో ప్రత్యేక పూజలు

**యాడికి, ఆగష్టు 31అనంత జనశక్తి న్యూస్**

**మండల కేంద్రంలోని భైరవ కొండపై ఉన్న భైరవ లింగేశ్వర శివాలయంలోను, అయ్యప్ప స్వామి దేవాలయంలో ను ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం లోను, భోగలింగేశ్వర స్వామి దేవాలయంలోను, ఉన్నత పాఠశాల వెను క ఉన్నశ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలోను, కోనలో ఉన్న రామ లింగేశ్వరస్వామి దేవాలయం లోను, పలు శివాలయాలలోను సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. శివునికి అభిషేకాలు చేసి, వివిధ పూలమాలతో అలంకరిం చారు. అర్చనలు చేసి, హారతులను సమర్పించారు. భక్తులు అధిక సం ఖ్యలో పాల్గొని శివున్ని దర్శించి, టెంకా యలను సమర్పించారు.కరుణించ వయ్యా .........భోలా శంకర అని వేడుకో న్నారు. భక్తు లకు తీర్థ ప్రసాదాలను అంద చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయక మిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.**



# బీజేపీ రాష్ట్ర కల్చరల్ సెల్ సభ్యునిగా సిద్ధోజు మాధవాచారి నియామకం

### అందరు సహకారంతో పార్టీ అభివృద్ధి కోసం నిరంతర కృషి చేస్తా

మహేశ్వరం, ఆగస్టు 31:( అనంత జనశక్తి)



రంగారెడ్డి జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యులు, మహేశ్వరం మండల సీనియర్ నాయకులు సిద్ధోజు మాధవాచారి ని బీజేపీ రాష్ట్ర కల్చరల్ సెల్ జన చైతన్య కళామండలి సభ్యునిగా నియమిస్తూ రాష్ట్ర కన్వీనర్ నాగపురి రాజమౌళి గారు నియామక పత్రం అందజేశారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు కి , రాష్ట్ర కల్చరల్ సెల్ కన్వీనర్ నాగపురి రాజమౌళికి, రాష్ట్ర కల్చరల్ కమిటీ సభ్యులకు, రంగారెడ్డి జిల్లా బీజేపీ నాయకులకు, ప్రతి కార్యకర్తకు మాధవాచారి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "నాకు అప్పగించిన బాధ్యతను శక్తి వంచన లేకుండా నిర్వర్తిస్తాను. ప్రధాని నరేంద్ర మోదీ కేంద్రంలో చేస్తున్న అభివృద్ధి పనులు, పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రపంచంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలపడానికి చేస్తున్న కృషిని, బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తాను. తెలంగాణలో, ముఖ్యంగా మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి కళా రూపాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేస్తాను" అని అన్నారు.సిద్ధోజు

**మాధవాచారి రాజకీయ ప్రస్థానం:**

మొదట ఆర్ఎస్ఎస్ లో శారీరక్ ప్రముఖ్ గా సేవలందించారు. నాగిరెడ్డిపల్లి గ్రామానికి రెండుసార్లు ఉప సర్పంచ్ గా, ఒకసారి సర్పంచ్ గా పనిచేశారు. బీజేపీలో మహేశ్వరం మండల ఉపాధ్యక్షునిగా, రెండుసార్లు ప్రధాన కార్యదర్శిగా, రెండుసార్లు మండల కిసాన్ మోర్చా అధ్యక్షునిగా, రంగారెడ్డి జిల్లా జన చైతన్య కళామండలి ప్రధాన కార్యదర్శిగా, కన్వీనర్ గా, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా రెండుసార్లు, మహేశ్వరం మండల అధ్యక్షునిగా పనిచేశారు. తెలంగాణ ఉద్యమంలో పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేశారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబర్ గా కొనసాగుతున్నారు.

# మహాజన సోషలిస్టు పార్టీ మన్సురాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా నర్రా శ్రీనివాస్



ఎల్బీనగర్, ఆగస్టు 31 అనంత జనశక్తి న్యూస్

సమాజంలో కొనసాగుతున్న రాజకీయ, సామాజిక అసమానతలపై పోరాడుతూ సమానత్వ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పీ) సీనియర్ నాయకులు, ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్ మాదిగ పిలుపునిచ్చారు.ఎంఎస్పీ నూతన నిర్మాణంలో భాగంగా మన్సురాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా నర్రా శ్రీనివాస్‌ను నియమించారు. మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో బత్తిన సుధాకర్ మాదిగ నర్రా శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సుధాకర్ మాదిగ మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం సాధించే దిశగా ఎంఎస్పీ కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు గండి కోట భీంరాజు, ప్రధాన కార్యదర్శి గోపు శివ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కాశీ మాదిగ, సీనియర్ నాయకులు క్రాంతికుమార్, గ్యారా యాదయ్య మాదిగ, ఏసు మాదిగ, దూది దుర్గ, గిరి, మణికంఠ, దేవా, యల్లయ్య, రాములు, దేవేందర్, సందీప్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.4కోట్లు చెక్ ఇచ్చింది..

### - అకౌంట్‌లో చూస్తే 3 రూపాయలే
### - భారీ విరాళం చెక్ బౌన్స్ మ్యాటర్

అయోధ్య, అనంత జనశక్తి న్యూస్

అయోధ్య రామ మందిరానికి ఓ మహిళ భక్తురాలు ఇచ్చిన రూ.4 కోట్ల భారీ విరాళం చెక్ బౌన్స్ మ్యాటర్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇంత పెద్ద మొత్తానికి చెక్ ఇచ్చిన ఆమె బ్యాంకు ఖాతాలో మాత్రం కేవలం రూ.3 మాత్రమే ఉండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దీంతో అసలు ఆమె ఎందుకు ఇంత భారీ మొత్తానికి చెక్ ఇచ్చారు? ఆ చెక్ బౌన్స్ కావడంతో ఇప్పుడు ఏం జరగబోతోంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

చెన్నైకి చెందిన ఓ మహిళా భక్తురాలు శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు రూ.4 కోట్ల చెక్ ఇచ్చారు. అయితే ఈ డబ్బును ఆలయంలో పనిచేస్తున్న సిబ్బంది సౌకర్యాలు, సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయాలని కూడా కోరారు. అంతేకాదు ఈ మొత్తాన్ని అదే అవసరాలకు ఉపయోగిస్తామని ట్రస్ట్ నుంచి లిఖితపూర్వక హామీ ఇవ్వాలని కూడా ఆమె షరతు పెట్టినట్లు తెలుస్తోంది.

అయితే ట్రస్ట్ నిబంధనల ప్రకారం ఒక దాత సూచించిన నిర్దిష్ట ప్రయోజనం కోసమే డబ్బును ఖర్చు చేస్తామని ప్రత్యేకంగా హామీ ఇవ్వడం సాధ్యం కాదని అధికారులు ఆమెకు వివరించినట్లు సమాచారం. ఆ తర్వాత ఆమె ఇచ్చిన రూ.4 కోట్ల చెక్కును ట్రస్ట్ బ్యాంకులో జమ చేసింది. చెక్ క్లియర్ చేసే ప్రక్రియలో ఖాతాను పరిశీలించిన బ్యాంకు అధికారులు అసలు విషయం తెలుసుకుని అవాక్కయ్యారు.

ఆ చెక్కుకు సంబంధించిన ఖాతాలో కేవలం రూ.3 మాత్రమే ఉన్నట్లు తేలింది. డబ్బు లేకపోవడంతో చెక్ కూడా బౌన్స్ అయింది. దీంతో ఖాతాలో నిధులు లేకపోయినా ఇంత భారీ మొత్తానికి చెక్ ఎందుకు ఇచ్చారనే ప్రశ్న ఇప్పుడు తలెత్తింది. ఈ విషయంపై మహిళకు నోటీసు ఇచ్చి వివరణ కోరేందుకు బ్యాంకు అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

అయితే ఆమె ఆలయానికి పూర్తిగా విరాళం ఇవ్వలేదని చెప్పడానికి కూడా వీల్లేదు. ఎందుకంటే రూ.4 కోట్ల చెక్‌తో పాటు మరో రూ.10 వేల మొత్తాన్ని విరాళంగా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ మొత్తాన్ని ఆలయానికి అందజేసి రసీదు కూడా తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం రూ.4 కోట్ల చెక్‌కు సంబంధించిన వ్యవహారాన్ని ట్రస్ట్ ఆమెతో చర్చల ద్వారా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉంటే అయోధ్య రామ మందిరానికి వచ్చే విరాళాల పరిమాణం కూడా భారీగానే ఉంది. ప్రతి నెలా ఆలయానికి సుమారు రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు విరాళాలు వస్తున్నట్లు సమాచారం. ఇందులో చెక్కుల రూపంలోనే నెలకు దాదాపు రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకు విరాళాలు అందుతున్నాయి. రామ మందిర నిర్మాణం కోసం 2020లో నిర్వహించిన నిధి సమర్పణ అభియాన్ సమయంలో కూడా భారీ మొత్తంలో విరాళాలు సేకరించారు. దేశవ్యాప్తంగా 45 రోజుల పాటు సాగిన ఆ కార్యక్రమంలో దాదాపు రూ.3,500 కోట్లు సమీకరించినట్లు సమాచారం. ఆ సమయంలో కూడా కొన్ని చెక్కులు బౌన్స్ అయ్యాయి. తర్వాత వాటిలో చాలా మొత్తాన్ని రికవరీ చేసినప్పటికీ, సుమారు రూ.22 కోట్ల వరకు ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ తాజా ఘటనకు మరింత ప్రాధాన్యం రావడానికి మరో కారణం కూడా ఉంది. కొద్ది నెలల క్రితమే రామ మందిరం విరాళాల నిర్వహణకు సంబంధించి దుర్వినియోగం ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఇప్పుడు రూ.4 కోట్ల చెక్ బౌన్స్ వ్యవహారం వెలుగులోకి రావడంతో ఆలయానికి వస్తున్న విరాళాలను ఎలా నిర్వహిస్తున్నారు, వాటి లెక్కలు ఎలా పర్యవేక్షిస్తున్నారు అనే అంశాలపై మరోసారి చర్చ మొదలైంది.

**అయితే ఈ వ్యవహారంపై రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. చెక్ ఎందుకు జారీ చేశారు, దాని వెనుక మహిళ ఉద్దేశం ఏమిటి, ఈ వ్యవహారం చివరకు ఎలా పరిష్కారమవుతుంది అనేది అధికారిక వివరణ వచ్చిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ మొత్తం వ్యవహారంలో మాత్రం రూ.4 కోట్ల చెక్‌కు ఖాతాలో కేవలం రూ.3 ఉండటమే అందరి దృష్టిని ఆకర్షిస్తున్న అంశంగా మారింది.**

# ఫ్యూచర్ సిటీలో కలపడంపై పెరుగుతున్న మద్దతు

- ఫ్యూచర్ సిటీలో కలిపే వరకు పోరాటం ఉధృతం చేస్తాం
- ఫ్యూచర్ సిటీలో కలపకుండా అడ్డు పడుతున్న వారిని ప్రజలే అడ్డుకుంటారు
- మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో పూర్తిగా విలీనం చేయాలి
- 2 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు ప్రారంభం
- ఫ్యూచర్ సిటీ జేఏసీ అధ్యక్షుడు వి. రఘుపతి
- గౌరవ అధ్యక్షుడు కర్నాటి మనోహర్

*మహేశ్వరం, ఆగస్టు 31: (అనంత జన శక్తి) *




భారత్ ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలాన్ని పూర్తిగా విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ ఆధ్వర్యంలో రెండు రోజుల రిలే నిరాహార దీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి.మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో జేఏసీ నాయకులు దీక్షకు కూర్చున్నారు. మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని కోరుతూ గత ఏడాది కాలంగా జేఏసీ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ధర్నాలు, రాస్తారోకోలు, బైక్ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించడంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో ఆందోళనను మరింత ఉధృతం చేస్తూ రిలే నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టారు.ఈ దీక్షలకు కుల, మత, పార్టీలకు అతీతంగా వివిధ వర్గాల నుంచి మద్దతు లభించింది. ఫ్యూచర్ సిటీ జేఏసీ అధ్యక్షుడు వి. రఘుపతి, గౌరవ అధ్యక్షుడు కర్నాటి మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కదారి జంగయ్య యాదవ్, పోతల దర్శన్ యాదవ్, సీపీఐ రాష్ట్ర నాయకులు దత్తు నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వి. మల్లేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాండు నాయక్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర గణేష్, మన్నాన్‌పల్లి గ్రామ ఉపసర్పంచ్ వి. నరసింహ యాదవ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఈశ్వర్ నాయక్, బీజేపీ నాయకులు అల్లంపల్లి మల్లేష్, రమేష్, పి. సాంబయ్య యాదవ్, ఐ. నరసింహ గౌడ్, సర్దార్‌నగర్‌కు చెందిన బీజేపీ నాయకులు స్వామి గౌడ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

**డిమాండ్ నెరవేరే వరకు పోరాటం**

ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వి. రఘుపతి మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీకి మహేశ్వరం మండలం అత్యంత సమీపంలో ఉన్నప్పటికీ దాన్ని విలీనం చేయకపోవడం వల్ల ఈ ప్రాంత రైతులు, యువత భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో మహేశ్వరాన్ని విస్మరించడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలు సమావేశాలు నిర్వహించి మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలనే తీర్మానాలు చేసి, వాటిని జేఏసీ కమిటీ సభ్యులతో పాటు ప్రభుత్వ అధికారులకు అందజేయాలని కోరారు.తీర్మానాలు ఇవ్వని పక్షంలో స్వచ్ఛందంగా మహేశ్వరం బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. తమ డిమాండ్ నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేసిన చిలకమర్రి నర్సింహ**

అనంతరం సోమవారం సాయంత్రం మాజీ ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ చిలకమర్రి నర్సింహ దీక్షా శిబిరానికి చేరుకుని జేఏసీ కమిటీ సభ్యులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన జేఏసీ నాయకుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ ఇంద్రకంటి నరసింహ గౌడ్, ఇంద్రకంటి వెంకటేష్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు చిట్టి మల్లేష్, మండల యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిట్టి గణేష్, తడకల శీను, జి. శీను తదితరులు దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

# శిరీషకు నివాళులు అర్పించిన ప్రైమ్ కేర్ హాస్పిటల్ యాజమాన్యం

- గంటల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకున్న పోలీసులకు కృతజ్ఞతలు

మహేశ్వరం, ఆగస్టు 31 ( అనంత జనశక్తి ):




తుక్కుగూడలోని ప్రైమ్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో ఇటీవల చోటుచేసుకున్న దురదృష్టకర ఘటనలో మృతి చెందిన శిరీషకు హాస్పిటల్ యాజమాన్యం ఘనంగా నివాళులు అర్పించింది.

ఈ ఘటనపై సత్వరమే స్పందించి, గంటల వ్యవధిలోనే నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్న పోలీసు బృందానికి ప్రైమ్ కేర్ హాస్పిటల్ యాజమాన్యం, తుక్కుగూడ వైద్య యూనియన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాయి.ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ.. "ఘటన జరిగిన సమయంలో మా ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్యులకు, సిబ్బందికి పోలీసులు అందించిన సత్వర సహాయం మరువలేనిది. నిందితుడిని అతి తక్కువ సమయంలోనే పట్టుకోవడంలో పోలీసులు ప్రదర్శించిన వేగం, అంకితభావం అభినందనీయం. ఇది పోలీసు వ్యవస్థ అసాధారణ కృషికి నిదర్శనం.

మీ సత్వర జోక్యం మా ఆసుపత్రికే కాకుండా మొత్తం తుక్కుగూడ వైద్య సమాజానికి ధైర్యాన్ని, భరోసాను ఇచ్చింది. వైద్య సమాజం ఆందోళనలో ఉన్న సమయంలో మీరు స్పందించిన తీరు పోలీసు వ్యవస్థపై, న్యాయ వ్యవస్థపై మా నమ్మకాన్ని మరింత బలపరిచింది" అని పేర్కొన్నారు.అలాగే ఈ కేసులో నిందితుడిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుని తగిన శిక్ష పడేలా చూడాలని, ఇది బాధితురాలికి న్యాయం జరగడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు పాల్పడే వారికి హెచ్చరికగా నిలుస్తుందని కోరారు. బాధితురాలు శిరీష కుటుంబానికి అవసరమైన అన్ని విధాలా అండగా ఉంటామని, ఎలాంటి సహాయం కావాలన్నా అందుబాటులో ఉంటామని ప్రైమ్ కేర్ హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది.

# రైతులు, పేదల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఏర్పుల శేఖర్
- లేమూరు సర్వే నంబర్ 102లో ఇళ్ల స్థలాల కేటాయింపు, రిజిస్ట్రేషన్లను తక్షణమే పూర్తి
- మహేశ్వరం ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా

మహేశ్వరం, ఆగస్టు 31 (అనంత జన శక్తి ):



ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ(ఎం) మహేశ్వరం మండల కార్యదర్శి ఏర్పుల శేఖర్ అన్నారు.మహేశ్వరం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు.
పెన్షన్లు పెంచుతామని చెప్పి, ఉన్న పెన్షన్లను కూడా తగ్గిస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే పెన్షన్లను పెంచాలని, మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపుల్లో బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలన్నారు. మండలంలో నెలకొన్న అనేక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు.ప్రభుత్వ హామీపై విశ్వాసంతో ఫ్యాబ్ సిటీ రైతులు 93 రోజుల రిలే దీక్షలను విరమించామని గుర్తు చేశారు.ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు లేమూరు సర్వే నంబర్ 102లో ఇళ్ల స్థలాల కేటాయింపు, రిజిస్ట్రేషన్లను తక్షణమే పూర్తి చేసి రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కరత్, ఫ్యాబ్ సిటీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోదాసు నరసింహ, ఫ్యాబ్ సిటీ నాయకులు పాలకూర నాగేష్, మునుగని గిరీష్, రమేష్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీలను బంగారంగా భావించి ఇంట్లోనే దాచాలి"

కేరళ, అనంత జనశక్తి న్యూస్

కేరళకు చెందిన ప్రముఖ ఇస్లామిక్ మత గురువు, గ్రాండ్ ముఫ్తీ షేక్ అబూబకర్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. మహిళలు తమ ఇళ్లకే పరిమితం కావాలని, బహిరంగ సమాజంలోకి రాకూడదని ఆయన వ్యాఖ్యానించారు. కొచ్చిలో జరిగిన 'హబ్బాయిల్ రసూల్' సదస్సులో మాట్లాడిన ఆయన.. మహిళలను బంగారంలా భావించిన ఇళ్లలోనే దాచుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకే ఇస్లాం పర్దా విధానాన్ని నిర్దేశించిందని పేర్కొంటూ ఈ వ్యాఖ్యలు చేయగా.. తీవ్ర వివాదానికి దారి తీశాయి.

**బంగారు ఆభరణాలతో మహిళల పోలిక..!**

కాంతపురం తన ప్రసంగంలో మహిళలను ఒక విచిత్రమైన ఉదాహరణతో పోల్చారు. విలువైన బంగారు హారాన్ని కొనుగోలు చేసేటప్పుడు దానిని జాగ్రత్తగా కప్‌బోర్డ్ నుంచి, ఒక పెట్టె నుంచి తీసి చూపిస్తారని.. అదే రోకలి బండలు అమ్మే దుకాణంలో మాత్రం వాటిని రోడ్డు పక్కన పడేస్తారని వ్యాఖ్యానించారు. బంగారాన్ని రోడ్డు పక్కన పడేస్తే.. దారిన పోయే ప్రతీ ఒక్కరూ కి దాని అందాన్ని, విలువను పాడు చేస్తారని అన్నారు. అందుకే అందరూ దాన్ని దాచి ఉంచుతారని పేర్కొన్నారు. మహిళలు కూడా బంగారు ఆభరణం లాంటి వారని, వారి అందం, గౌరవం నిలవాలంటే ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని వ్యాఖ్యానించారు. మహిళలను సమాజంలోకి స్వేచ్ఛగా అనుమతిస్తే తీవ్ర నష్టం లేదా వినాశనం జరుగుతుందని, అందుకే పర్దా పద్ధతి అవసరమని ఆయన వాదించారు.

**మత గ్రంథాలు, చరిత్ర ఆధారంగా వాదన..!**

ఖురాన్ ప్రకారం మహిళలు ఇళ్లకే పరిమితం కావాలని స్పష్టంగా ఉందంటూ తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. సమస్త కేరళ జమియ్యతుల్ ఉలమా శతాబ్ద కాలంగా ఈ విషయాన్నే బోధిస్తోందని, దీనివల్లే దేశంలోని మహిళలు తమ గౌరవాన్ని కాపాడుకోగలుగుతున్నారని తెలిపారు. ఇది మహిళల హక్కులను తగ్గించడం కాదని, వారిని గౌరవించడం మాత్రమేనని చెప్పారు. ఇస్లాం పూర్వ కాలంలో అరబ్ సమాజంలో ఉన్న ఆడపిల్లల హత్యలను ఇస్లాం నిషేధించిందని.. ఆ కాలంలోనే మహిళలకు ఆస్తి హక్కులను అందించి వారి స్థాయిని పెంచిందని ఆయన గుర్తుచేశారు. కాబట్టి బహిరంగ ప్రదేశాలపై ఉన్న ఆంక్షలు మహిళలకు ఇచ్చే గౌరవంగానే భావించాలని అన్నారు.

తన వ్యాఖ్యలను, అధికారాన్ని ప్రశ్నిస్తున్న సంస్థలపై కాంతపురం మండిపడ్డారు. తాము మతాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశామని, అందువల్ల మతం గురించి మాట్లాడే పూర్తి హక్కు, బాధ్యత తమకు ఉన్నాయని స్పష్టం చేశారు. "మేము ఈ విషయాలను చెబుతూనే ఉంటాము. మమ్మల్ని ఎవరూ ఆపలేరు" అని తేల్చి చెప్పారు. తాము ఇతర మతాల ఆచారాల్లో జోక్యం చేసుకోవడం లేదని, అలాగే తమ సమాజానికి దిశానిర్దేశం చేసే హక్కు తమకు ఉందంటూ విమర్శకులకు సమాధానమిచ్చారు.

# ఇథనాల్ శాతాన్ని పెట్రోల్ బంకులు వెల్లడించాలా?

### - పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు
### - ఇథనాల్ కలిపి పెట్రోల్ విక్రయంపై అనుమానాలు
### - ఈ 20 శాతం బంకులు వెల్లడించాలని పిల్ దాఖలు

న్యూఢిల్లీ, అనంత జనశక్తి న్యూస్


పెట్రోల్ కొనుగోలు చేసినప్పుడు అందులో ఎంత శాతం ఇథనాల్ ఉందో తెలుసుకోవాలనుకుంటున్నారా? ప్రస్తుతం పెట్రోల్ బంకులు ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తెలిపింది. ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద పెట్రోల్‌లో కలిపిన ఇథనాల్ శాతాన్ని తప్పనిసరిగా బహిర్గతం చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని పేర్కొంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే, పిటిషనర్ ఈ అంశాన్ని సంబంధిత అధికారిక సంస్థల దృష్టికి తీసుకెళ్లవచ్చని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది.

న్యాయమూర్తులు జస్టస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ పి.బి. వరాలేలతో కూడిన ధర్మాసనం లాయర్ నరేంద్ర కుమార్ గోస్వామి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించింది. పెట్రోల్ బంకుల్లో ఉండే నాజిల్స్‌పై ఇథనాల్ వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని, ఇంధనం కొనుగోలు చేసిన బిల్లులు, రశీదులపై శాతాన్ని విధిగా ప్రింట్ చేయాలని, వివిధ వాహనాల తయారీ, మోడల్స్, ఇంజిన్ రకాలు, తయారీ సంవత్సరాల ఆధారంగా... ఏ వాహనానికి ఏ రకమైన ఇథనాల్ మిశ్రమం సరిపోతుందో తెలిపే డేటాబేస్‌ను రూపొందించాని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన E20 విధానాన్ని ఈ పిటిషన్ సవాలు చేయడం లేదని కోర్టుకు తెలిపారు. కస్టమర్లు తాము కొనుగోలు చేస్తున్న ఇంధనం గురించి పూర్తి సమాచారం తెలుసుకునే హక్కు మాత్రమే కోరుతున్నామని, ప్రస్తుతం బంకుల్లో విక్రయిస్తున్న పెట్రోల్ E20 అవునో కాదో స్పష్టంగా తెలియడం లేదని వాదించారు. అయితే ఆర్టికల్ 32 కింద ఈ ప్రజాప్రయోజన పిటిషన్‌ను విచారించడానికి నిరాకరించిన సుప్రీంకోర్టు.. పిటిషనర్ సంబంధిత అధికారిని లేదా సంబంధిత హైకోర్టును ఆశ్రయించవచ్చని స్పష్టం చేసింది. E20 పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్, 80 శాతం సాధారణ పెట్రోల్ ఉంటాయి. భారత్ చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, కర్బన ఉద్గారాలను అదుపు చేయడం, దేశీయంగా తయారయ్యే బయో ఫ్యూయల్ వినియోగాన్ని పెంచడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.

మంగళవారం | రంగారెడ్డి
01.09.2026
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం



# బిజీగా ఉండే ఉద్యోగుల కోసం 4 డెస్క్ యోగా స్ట్రెచ్‌లు




ఆఫీసులో కూడా యోగాను ఎలా చేర్చుకోవచ్చో చూద్దాం. సాధారణంగా యోగా అంటే మ్యాట్‌లు, తోటల్లో చేసేదిగానే చాలామంది అనుకుంటారు. దీనివల్ల బిజీ షెడ్యూల్స్ ఉన్నవాళ్ళు యోగా చేయడానికి సమయం దొరకక ఇబ్బంది పడుతుంటారు. కానీ యోగా అనేది చాలా సరళమైనది, సులభంగా మార్చుకోదగినది. డెస్క్ యోగా స్ట్రెచ్‌లతో దీన్ని మన రోజువారీ ఆఫీసు పనిలో సులభంగా కలిపేసుకోవచ్చు. ఇలా చేస్తే, ఉద్యోగులు ఎక్కువ గంటలు పనిచేసినా ఉత్సాహంగా, ఒత్తిడి లేకుండా ఉండొచ్చు. హిమాలయన్ సిద్ధా అక్షర్ యోగా కేంద్ర స్థాపకులు, యోగా నిపుణుడు హిమాలయన్ సిద్ధా అక్షర్ ఉద్యోగుల కోసం 4 డెస్క్ యోగా స్ట్రెచ్‌లను, వాటిని ఎలా చేయాలో స్టెప్ బై స్టెప్ వివరించారు.



1. గ్రీవ సంచాలన క్రియ (మెడ తిప్పడం):
ఎలా చేయాలి: డెస్క్ వద్ద కూర్చుని, వీపును నిటారుగా ఉంచండి. మెడను నెమ్మదిగా సవ్యదిశలో (క్లాక్‌వైజ్) తిప్పండి. పైకి వెళ్లేటప్పుడు శ్వాస తీసుకోండి. క్రిందకు వచ్చేటప్పుడు శ్వాస వదలండి. ఇలా 5-8 సార్లు చేయండి. తర్వాత అపసవ్యదిశలో (యాంటీ-క్లాక్‌వైజ్) మళ్ళీ చేయండి.
ప్రయోజనాలు: మెడ, భుజాలపై ఉన్న ఒత్తిడిని తగ్గిస్తుంది. మనసును స్థిమితంగా ఉంచుతుంది.

2. తాడాసనం:
ఎలా చేయాలి: డెస్క్ వర్క్ చేస్తున్నప్పుడు ప్రతి రెండు గంటలకు ఒకసారి లేచి నిలబడండి. చేతి వేళ్ళను ఒకదానితో ఒకటి కలిపి, చేతులను తల పైన పూర్తిగా పైకి చాచండి. మీ శరీర బరువును కాలివేళ్లపై ఉంచి, మొత్తం శరీరాన్ని సాగదీయండి. ఇలా 5 సార్లు చేయండి.
ప్రయోజనాలు: శరీరమంతా రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. కండర వ్యవస్థకు తక్షణమే శక్తినిస్తుంది.





శరీరాన్ని తిరిగి సరైన స్థితికి తీసుకువస్తుంది.


3. పరివృత్త సుఖాసనం (ట్విస్టెడ్ ఈజీ పోజ్):
ఎలా చేయాలి: కుర్చీలో నిటారుగా, సౌకర్యవంతంగా కూర్చోండి. ఎడమ చేతిని కుడి మోకాలిపై ఉంచండి. శరీరం పై భాగాన్ని కుడి వైపుకు తిప్పుతూ, కుడి చేతితో కుర్చీ వెనుక భాగాన్ని పట్టుకోండి. ఛాతీని ముందుకు ఉంచి, వెన్నెముకను నిటారుగా సాగదీయండి.
ప్రయోజనాలు: శ్వాస లోతుగా తీసుకుంటూ 5-8 సెకన్ల పాటు అలాగే ఉంచండి. ఇరువైపులా 3-5 సార్లు పునరావృతం చేయండి. ఇది వెన్నెముకపై ఉన్న ఒత్తిడిని తక్షణమే తగ్గిస్తుంది. గుండె, ఊపిరితిత్తుల వైపు శక్తి ప్రవాహాన్ని పెంచుతుంది. శరీర పై భాగాన్ని సరైన స్థితికి తెచ్చి, విశ్రాంతినిస్తుంది.

4. నాసికాగ్రహ దృష్టి (ముక్కు చివర దృష్టి):
ఎలా చేయాలి: సౌకర్యవంతమైన భంగిమలో కూర్చుని, కనురెప్పలు వాల్చకుండా ముక్కు చివరను ఎంతసేపు చూడగలిగితే అంతసేపు చూడడానికి ప్రయత్నించండి.
ప్రయోజనాలు: ఇది పూర్తయిన తర్వాత కళ్ళు మూసుకుని విశ్రాంతి తీసుకోవచ్చు, లేదా అరచేతులను వేడి చేసి కళ్ళపై ఉంచుకోవచ్చు (వార్మ్ పాల్మింగ్). ఈ స్థిరత్వం, ఏకాగ్రతను పెంచుతుంది.



# మీరు ఊహించిన దానికంటే ఎక్కువ హాని కలిగించే 5 కిచెన్ వస్తువులు





మీ వంటింటి వస్తువులు మీకు తెలియకుండానే దీర్ఘకాలంలో మీ ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నాయా? ఇన్‌స్టాగ్రామ్‌లో విలువైన ఆరోగ్య చిట్కాలను పంచుకుంటూ ఉండే కార్డియాలజిస్ట్ డాక్టర్ అలోక్ చోప్రా, సురక్షితమైన వంటింటి వస్తువుల ప్రాముఖ్యతను ఇటీవల తెలియజేశారు. హానిచేయనివిగా కనిపించే ఐదు వంటింటి వస్తువులు కాలక్రమేణా తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తాయని డాక్టర్ చోప్రా నొక్కి చెప్పారు. "మీ వంటగది సురక్షితంగా ఉందని అనుకుంటున్నారా? ఈ 5 రోజువారీ వస్తువులు మీరు అనుకున్నదానికంటే ఎక్కువ హాని కలిగించవచ్చు. మీరు దేనితో వండుతున్నారో తిరిగి ఆలోచించాల్సిన సమయం ఇది. మీరు ఏమి వండుతున్నారో మాత్రమే కాదు" అని ఆయన రాశారు.

నాన్‌స్టిక్ ప్యాన్‌లు:
ఈ పాత్రలను ఎక్కువగా వేడి చేయడం వల్ల విషపూరిత పొగలు వెలువడతాయి. అలాగే గీతలు పడినప్పుడు హానికరమైన రసాయనాలు ఆహారంలో కలవవచ్చు. PFOA, PFAS వంటి రసాయనాలు ఉన్న పాత ప్యాన్‌లు శరీరంలో పేరుకుపోయి ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. ఈ రసాయనాలు హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీయడం, రోగనిరోధక వ్యవస్థపై ప్రభావం చూపడం, దీర్ఘకాలిక విషపూరితం కావడంతో ముడిపడి ఉన్నాయి.
దీనికి బదులుగా ఏమి వాడాలి: స్టెయిన్‌లెస్ స్టీల్, కాస్ట్ ఇనుము (ఇనుప), గాజు లేదా సిరామిక్ పాత్రలను ఎంచుకోండి. ఎక్కువ వేడి చేయడం లేదా పాడైన ప్యాన్‌లను వాడటం మానుకోండి.

అల్యూమినియం ఫాయిల్:
పుల్లని ఆహారాలతో లేదా అధిక ఉష్ణోగ్రతల వద్ద ఉపయోగించినప్పుడు, అల్యూమినియం ఫాయిల్ నుండి లోహం మీ ఆహారంలో కలవవచ్చు.



దీర్ఘకాలికంగా దీనికి గురికావడం నాడీ సంబంధిత సమస్యలు, అల్జీమర్స్ ప్రమాదాన్ని పెంచుతుందని తేలింది. ఇది జీవఅధోకరణం చెందదు కాబట్టి, మీ ఆరోగ్యానికి, పర్యావరణానికి కూడా హానికరం.
దీనికి బదులుగా ఏమి వాడాలి: బేకింగ్ కోసం పార్చ్‌మెంట్ పేపర్‌ను, ఆహారాన్ని వేడి చేయడానికి, నిల్వ చేయడానికి గాజు లేదా సిలికాన్ కంటైనర్‌లను ఉపయోగించండి.

ప్లాస్టిక్ ఆహార కంటైనర్‌లు:
చాలా ప్లాస్టిక్‌లు, ముఖ్యంగా పాతవి లేదా నాసిరకం ప్లాస్టిక్‌లు, BPA, BPS, థలేట్స్ వంటి హానికరమైన రసాయనాలను విడుదల చేస్తాయి. మైక్రోవేవ్‌లో పెట్టినప్పుడు లేదా నూనె, పుల్లని లేదా వేడి ఆహారాలతో ఉపయోగించినప్పుడు ఇది ఎక్కువగా జరుగుతుంది. ఇవి హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి. సంతానోత్పత్తిపై ప్రభావం చూపుతాయి,



రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తాయి. నల్ల ప్లాస్టిక్ తరచుగా రీసైకిల్ చేసిన ఎలక్ట్రానిక్ వ్యర్థాల నుండి తయారవుతుంది. ఇది విషపూరితం కావచ్చు.
దీనికి బదులుగా ఏమి వాడాలి: ఆహారాన్ని గాజు, సిరామిక్ లేదా స్టెయిన్‌లెస్ స్టీల్ కంటైనర్‌లలో నిల్వ చేయండి. మైక్రోవేవ్ సేఫ్ అని చెప్పే ప్లాస్టిక్‌తో సహా ఎలాంటి ప్లాస్టిక్‌ను మైక్రోవేవ్‌లో పెట్టడం మానుకోండి.

ప్లాస్టిక్ వంట సామాగ్రి (గరిటెలు, స్పూన్లు):
వేడికి గురైనప్పుడు, ప్లాస్టిక్ గరిటెలు, స్పూన్‌ల నుండి ఫ్లేమ్ రిటార్డెంట్లు, రంగులు, మైక్రోప్లాస్టిక్స్ వంటి విషపూరిత పదార్థాలు వెలువడతాయి. ఇవి మీ ఆహారంలోకి చేరి శరీరంలో పేరుకుపోయి, మంటను, దీర్ఘకాలిక విషాన్ని కలిగిస్తాయి. ప్లాస్టిక్‌తో తరచుగా వండటం ఈ ప్రమాదాన్ని పెంచుతుంది.
దీనికి బదులుగా ఏమి వాడాలి: చెక్క, వెదురు లేదా స్టెయిన్‌లెస్ స్టీల్ సామాగ్రితో మార్చండి. ఇవి సురక్షితమైనవి, ఎక్కువ కాలం మన్నుతాయి. పర్యావరణానికి కూడా మంచివి.

గ్యాస్ స్టవ్‌లు:
గ్యాస్ స్టవ్‌లు బెంజీన్, నైట్రోజన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ వంటి ఇండోర్ వాయు కాలుష్యాలను విడుదల చేస్తాయి. ఇవి ఆస్తమా, శ్వాసకోశ అంటువ్యాధులు, క్యాన్సర్ ప్రమాదాన్ని కూడా పెంచుతాయి. వెంటిలేషన్ సరిగా లేని ఇళ్లలో, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఎక్కువ ప్రమాదంలో ఉంటారు.
దీనికి బదులుగా ఏమి వాడాలి: పరిశుభ్రమైన గాలి కోసం ఇండక్షన్ లేదా ఎలక్ట్రిక్ కుక్‌టాప్‌లను ఉపయోగించండి. కనీసం, వెంటిలేషన్‌ను మెరుగుపరచండి. కిటికీలు తెరవండి. ఎగ్జాస్ట్ ఫ్యాన్ లేదా చిమ్నీని ఏర్పాటు చేయండి. వీలైతే ఎయిర్ ప్యూరిఫైయర్‌ను ఉపయోగించండి.

అనంత జనశక్తి
మంగళవారం | రంగారెడ్డి
01.09.2026



## ఆనంద్, వైష్ణవి 'చెన్నై లవ్‌స్టోరీ' చేయకపోవడానికి కారణమిదే!



కొన్ని ఆసక్తికర కాంబినేషన్‌లను మళ్లీ మళ్లీ చూడాలనుకుంటారు ప్రేక్షకులు. దర్శక-రచయితలు కూడా వారిని దృష్టిలో పెట్టుకునే కథలు సిద్ధం చేస్తారు. తీరా సెట్స్‌పైకి వెళ్లే సమయానికి అనుకోని కారణాల వల్ల నటీనటులు మారిపోతుంటారు. ఇటీవల విడుదలై ఫీల్ గుడ్ మూవీగా పేరు తెచ్చుకున్న 'చెన్నై లవ్‌స్టోరీ' విషయంలోనూ ఇదే జరిగింది. తొలుత ఈ కథను మేకర్స్ హిట్ పెయిర్ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్యలను దృష్టిలో పెట్టుకునే మొదలు పెట్టారు. వాళ్లిద్దరూ కూడా చేయడానికి ఆసక్తి చూపారు. కానీ, కొన్ని కారణాల వల్ల ఆ మూవీ చేయలేకపోయినట్లు తాజాగా ఆనంద్ దేవరకొండ చెప్పుకొచ్చారు. "చెన్నై లవ్‌స్టోరీ' నేనూ వైష్ణవి చేయాల్సింది. అప్పటికి నాకు వేరే షెడ్యూల్స్ ఉన్నాయి. పైగా అది స్క్రిప్ట్ డెవలప్‌మెంట్ దశలోనే ఉంది. దీంతో సమయం ఎక్కువైపోయింది. 'నేను ఇంకో సినిమా చేయాలి' వాళ్లతో చెప్పాను. 'సరే మేం వేరే హీరోను ప్రయత్నిస్తాం' అని చెప్పారు. వాళ్లు వేరే హీరో అనుకున్నప్పుడు కథానాయికగా కూడా వేరే వాళ్లను తీసుకుంటే బాగుంటుందని వాళ్లు భావించి ఆ సినిమా తీశారు" అని అన్నారు.

ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న చిత్రం 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్'. ఆదిత్య హాసన్ దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. సెప్టెంబరు 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. నాయకనాయికలు ప్రస్తుతం ఈ మూవీ ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ప్రేమ, యవ్వనం, స్నేహం, భావోద్వేగాల సమ్మేళనంగా 'ఎపిక్'ను తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.

## వచ్చే ఏడాది 'లైకీ లైకా'?




'శ్రీనివాస మంగాపురం' చిత్రంతో తనదైన నటనతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించింది బాలీవుడ్ కథానాయిక రషా థడానీ. ఇప్పుడామె మరో ప్రేమకథతో కుర్రకారుని ఆకట్టుకోవడానికి సిద్ధమవుతుంది. రషా, అభయ్ వర్మ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'లైకీ లైకా'. సౌరభ్ గుప్తా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రొమాంటిక్ డ్రామాని ఈ ఏడాది థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించింది చిత్రబృందం. ఇప్పడీ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రేమికుల రోజున విడుదల చేయాలని నిర్ణయించారట. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్-ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించనున్నారని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు రషాతో ఈ చిత్రంలో ఒక ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించనున్నట్లు సమాచారం.

## సీడ్ గణేశుడిని పూజించండి.. చిరంజీవి పిలుపు



ప్రకృతి సంరక్షణ కోసం, పచ్చదనం పెంపుకోసం ఈ సారి అందరూ సీడ్ గణేశుడిని పూజించాలని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని చెప్పారు. సీడ్ గణేశుడిని పూజించి ఆ తర్వాత ఇంట్లోనే నిమజ్జనం చేయడం వల్ల.. వినాయకుడు మొక్కై ఎదిగి మనల్ని ఆశీర్వదిస్తాడని తెలిపారు. 'గ్రీన్ ఇండియా చాలెంజ్' రూపొందించిన సీడ్ గణేశా ప్రతిమలను చిరంజీవి తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ రూపకర్త, మాజీ ఎంపీ సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను ఓ యజ్ఞంలా భావించి ఇప్పటికే 20 కోట్ల మొక్కలు నాటేలా లక్షల మందిని ప్రోత్సహించిన సంతోష్.. అభినందనీయుడని, ఆయన దీక్షకు తమ వంతు తోడ్పాటు ఉంటుందని ప్రశంసించారు.


## బ్యాక్ టు వర్క్.. ఈ క్షణాలు మిస్ అవుతానంటూ రష్మిక పోస్ట్..



షూటింగ్‌లో గాయపడిన నటి రష్మిక కోలుకున్నారు. తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఇంట్లో విశ్రాంతి తీసుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 'తిరిగి షూట్‌కు వెళ్తున్నా. కానీ, ఈ క్షణాలను మాత్రం కచ్చితంగా మిస్ అవుతాను' అంటూ వరలక్ష్మి వ్రతం చేస్తోన్న ఫొటోలతో పాటు.. ఇంట్లో తాను ఆడుకున్న పజిల్ చిత్రాలను షేర్ చేశారు. ఎట్టకేలకు రష్మిక తిరిగి సెట్‌లోకి వెళ్లడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమెకు జాగ్రత్తలు చెబుతూ.. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తున్నారు. మైసా' (Mysaa) చిత్రీకరణ సమయంలో రష్మిక గాయపడ్డారు. షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా తుంటి భాగంలో బలమైన గాయమైంది. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో రష్మిక ఇంట్లో ఉండి తరచూ తన హెల్త్ అప్‌డేట్‌లతో పాటు, తాను చేస్తోన్న పనులను అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారు.




## అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు లియోనెల్ మెస్సి గుడ్ బై



అర్జెంటీనా స్టార్ ఫుట్‌బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సి అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికాడు. మెస్సి తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా ఈ విషయాన్ని వెల్లడించాడు. స్పెయిన్‌తో జరిగిన ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో ఓడిపోయిన రెండు రోజులకే ఈ నిర్ణయం తీసుకున్నానని పేర్కొన్నాడు. మెస్సి అర్జెంటీనా తరపున 207 మ్యాచ్‌లలో 125 గోల్స్ చేశాడు. తన దేశానికి 2022 ఫిఫా ప్రపంచ కప్, 2021, 2024 రెండు కోపా అమెరికా టైటిళ్లను అందించాడు. 2026 ప్రపంచ కప్‌లో ఆయన సారథ్యంలో అర్జెంటీనా రన్నరప్‌గా నిలిచింది.

"అర్జెంటీనా జెర్సీ కోసం నా శక్తినంతా ధారపోశాను. జట్టుతో కలిసి దేశానికి ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించాను. అర్జెంటీనా ప్రజలను గర్వపడేలా చేయడం ఎప్పుడూ ఆనందమే. ఈ నిర్ణయం నా హృదయాన్ని ఎంతో బాధించింది. జాతీయ జట్టుకి ఇవ్వడానికి ఇక ఏమీ మిగలలేదు. యువ ఆటగాళ్లు జాతీయ జట్టులోకి రావడానికి ఇదే సరైన సమయం. 20 ఏళ్లుగా అందించిన ప్రేమ, అభిమానానికి అర్జెంటీనా ప్రజలకు కృతజ్ఞతలు. ఇకపై జాతీయ జట్టును బయట నుంచి అభిమానించే సాధారణ అభిమానిగా ఉంటాను. కుటుంబం, కోచ్‌లు, సహచరులు, జట్టు అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు. జాతీయ జట్టుతో గడిపిన అనుభవాలు జీవితాంతం గుర్తుండిపోతాయి. నన్ను అర్జెంటీనియన్‌గా పుట్టించినందుకు దేవుడికి కృతజ్ఞతలు" అని తన రిటైర్మెంట్ ప్రకటనలో పేర్కొన్నాడు.

## సీఎస్కేలో ధోని వాటాల కొనుగోలు.. స్పందించిన ఫ్రాంచైజీ



మహేంద్ర సింగ్ ధోని ఐపీఎల్ తొలి ఎడిషన్ నుంచి చెన్నై సూపర్ కింగ్స్ కు ఆడుతూ ఆ ఫ్రాంచైజీకి ప్రధాన ఆకర్షణగా మారాడు. సీఎస్కేకు ఐదు టైటిళ్లు అందించిన 'మిస్టర్ కూల్' ఆ ఫ్రాంచైజీతో తన బంధాన్ని మరింత బలంగా మార్చుకోవడం కోసం వాటాలు కొనుగోలు చేసేందుకు ప్రయత్నించినట్లు వార్తలొచ్చాయి. ఈ అంశంపై సీఎస్కే సీఈవో కాశీవిశ్వనాథన్ స్పందించారు. ధోని వాటాల కొనుగోలుపై జరిగిన ప్రచారాన్ని ఖండించారు. ఆ వార్తలన్నీ రూమర్సే అని పేర్కొన్నారు. వచ్చే సీజన్‌లో ధోని ఆడడని జరుగుతున్న ప్రచారంపై కూడా సీఎస్కే సీఈవో స్పందించారు. రాబోయే సీజన్‌లో ఆడనని ధోని ఇంకా చెప్పలేదన్నారు. అతను ఏ నిర్ణయం తీసుకుంటాడో వేచి చూద్దామన్నారు. సీఎస్కేలో 25 శాతం వాటా కొనుగోలు చేస్తానని ధోని ప్రతిపాదన చేశాడని, కానీ 3 శాతం వాటానే విక్రయిస్తామని ఫ్రాంచైజీ చెప్పిందని కొన్ని రోజుల కింద ప్రచారం జరిగింది. ధోని తన డిమాండ్‌ను 20 శాతానికి తగ్గించుకున్నటికీ.. సీఎస్కే అందుకు అంగీకరించలేదని వార్తలొచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సీఎస్కేతో ధోని సంబంధాలు దెబ్బతిన్నట్లు ప్రచారం జరిగింది. 2025 ఐపీఎల్ మెగా వేలానికి ముందు రూ.4 కోట్లతో ధోనిని సీఎస్కే రిటైన్ చేసుకుంది. గాయం కారణంగా 2026లో అతడు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు.


## తిలక్ వర్మ టాటూలు.. ఒక్కో దానికి ఒక్కో సీక్రెట్!




ప్రస్తుతం టాటూ ట్రెండ్‌కు యువతలో విపరీతమైన క్రేజ్ ఉంది. సెలబ్రిటీల నుంచి సామాన్యుల వరకు డిఫరెంట్‌గా కనిపించాలని శరీరమంతా టాటూస్ డిజైన్ వేయించుకుంటున్నారు. టీమ్‌ఇండియా యువ క్రికెటర్ తిలక్ వర్మ(కు కూడా టాటూస్ అంటే ఎంతో ఇష్టం. ఈ యంగ్ బ్యాటర్ తన శరీరంపై వేయించుకున్న టాటూల వెనుక ఆసక్తికర విషయాలు దాగి ఉన్నాయి. తిలక్ వర్మ పరమశివుని పరమ భక్తుడు. వినాయకుడు అంటే కూడా ఇష్టం. అందుకే తన కుడి చేతికి పూర్తిగా ఒక ఆధ్యాత్మిక థీమ్‌తో కూడిన స్లీవ్ టాటూ వేయించుకున్నాడు.

తన బైసెప్‌పై శివుడి రూపం, ముంజేతిపై వినాయకుడి టాటూ, అలాగే ఛాతీపై 'ఓం నమః శివాయ' అని రాయించుకున్నాడు. చేతికి స్లీవ్ టాటూలో పరమశివుడి పూజకు విశిష్టమైన మందార పువ్వుల డిజైన్‌ను చేతి మణికట్టు పైభాగంలో వేయించుకున్నాడు. అదే చేతికి అన్‌వేవరింగ్ సెల్ఫ్ ట్రస్ట్ (చలించని ఆత్మవిశ్వాసం) అనే వాక్యాలు రాయించుకున్నాడు.

తన తల్లిదండ్రులపై ఉన్న ప్రేమకు గుర్తుగా వారి పోర్ట్రెయిట్ (చిత్రాలు)లను పక్కటెముకల భాగంలో టాటూగా వేయించుకున్నాడు. తిలక్ వర్మ తనకు ఇష్టమైన పెంపుడు కుక్క 'ట్రిగర్' చిత్రాన్ని తన కాలుపై పచ్చబొట్టుగా వేయించుకున్నాడు. ముంబయిలోని ఏలియన్స్ టాటూ స్టూడియోలో తిలక్ ఈ టాటూలను వేయించుకున్నాడు. ఈ టాటూస్ యూత్‌ను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.





PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945